teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 217 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 6 డిసెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## టిజిఆర్టీసీ నూతన లోగో ఆవిష్కరణ

### తెలంగాణ ఆర్టీసీ చరిత్రలోనే విప్లవం : సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలంగాణ ఆర్టీసీ చరిత్రలోనే ఒక విప్లవమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో 43 వేల మంది ఆర్టీసీ కార్మికులు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కేసీఆర్ పాలనలో నష్టాల్లో కూరుకుపోయిన ఆర్టీసీని లాభాలబాట పట్టించామన్నారు. ఆర్టీసీ లోగో ఆవిష్కరణ ఈ మేరకు ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గ్ లో ఏర్పాటు చేసిన సభలో కొత్త ఆర్టీసీ లోగోను ఆవిష్కరించారు రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా తెలంగాణ వస్తే ఆర్టీసీ లాభాల బాట పడుతుందని భావించినా కేసీఆర్ నష్టాలపాలు చేశాడని

మిగతా 2 లో




పౌరులకు కల్పించబడ్డ చట్టభద్ధమైన హక్కులలో ఒకటైన సమాచార హక్కు చట్టం అమలు కావడంలో తెలంగాణ రాష్ట్రంలో మండల స్థాయి నుండి మొదలు జిల్లా స్థాయి మరియు రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వ పౌర సమాచార అధికారులు నిర్లక్ష్యంగా.. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. ఇది వారిపై ఉండే జవాబుదారితనాన్ని విష్మరిస్తూ అధికారం కాస్త వాళ్ళ హక్కు ఐయినట్లు.. అంతా వాళ్ళ ఇష్టం అన్నట్లు.. నియంతలలాగా వ్యవహరిస్తున్నారు. ఇదే తరహాలో స.హ దరఖాస్తుదారులకు మండలాల్లో.. జిల్లాల్లో ఇలాంటి అనుభవాలే ఎదురవుతున్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి సమాచారం అందించాల్సిందిగా పీఐఓలకు ఆదేశాలు జారీ చేయబడినప్పటికీ కూడా ఆదేశాలు గౌరవించబడడంలేదు. చట్టబద్ధమైన సమాచార హక్కు చట్టం అమలులో బాధ్యతారాహిత్యం (పౌర హక్కు అణచివేతకు గురి, హక్కు వినియోగించుకోవడం బంగం కలిగించడం) లాంటి పరిస్థితులు దరఖాస్తుదారులను అధికారం ఉన్నది చట్టాలను అమలు చేయడానికి కాదా.. చట్టాలను చుట్టాలను చేసుకోడానికేనా అనే ప్రశ్నర్థకంలో పడేస్తున్నాయి. ఈ పరిస్థితులు స.హ హక్కు అమలుపై ఆందోళన కల్పిస్తున్నది.

# చట్టభద్ధతను కోల్పోతున్న స.హ చట్టం



## 20 నెలలకు పైగా నియామకంకాని కమిషనర్లు

- ఆలస్యం వెనుకున్న రహస్యం ఏంటి..?
- నియామకాల ఆలస్యానికి సరైన కారణాలే కానస్తలేవ్..!
- ప్రశ్నించే గోతులను అణిచివేయాలనే యోచనా..?
- పథకాలతో అభివృద్ధంటూ.. హక్కులను కాలరాస్తున్నారా
- ప్రభుత్వాలపై విశ్వాసం కోల్పోతున్న పౌరులు
- తక్షణమే కమిషనర్ల నియామకాలకు డిమాండ్

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ (TSIC) ఇటీవలి కాలంలో గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. అక్టోబరు 2024 నాటికి, రాష్ట్రంలో సమాచార కమిషనర్ల నియామకాలు జరగకపోవడంతో సుమారు 20 నెలలకు పైగా కమిషన్ పూర్తి స్థాయిలో పనిచేయకుండా పోయింది. దీని ఫలితంగా దాదాపు పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లు మరియు

మిగతా 2 లో

## చల్పాకలో ముమ్మాటికి బూటకపు ఎన్కౌంటర్

### ద్రోహి సమాచారంతో విషమిచ్చి పొట్టన పెట్టుకున్నారు

- మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరిట కరపత్రం
- డిసెంబర్ 9న రాష్ట్ర వ్యాప్తంగా బందు పాటించాలని పిలుపు



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాకలో జరిగింది ముమ్మాటికి బూటకపు ఎన్కౌంటర్ అని, ద్రోహి ఇచ్చిన సమాచారంతో విషమిచ్చి ఏడుగురుని పొట్టన పెట్టుకున్నారని మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరిట ఆరోపనలతో ఓ కరపత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఎన్కౌంటర్‌కు





## లాంఛనంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం

### యాప్ ద్వారా వివరాలు సేకరించనున్న అధికారులు



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కాంగ్రెస్ సర్కార్ గురువారం లాంఛనంగా ప్రారంభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సచివాలయం వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ను ప్రారంభించారు.

హైదరాబాద్, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, పీసీసీ చీఫ్

మిగతా 2 లో



## ప్రశ్నిస్తున్న తెలంగాణ హ్యాష్‌ట్యాగ్‌తో కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు

- కాంగ్రెస్ అంటే కమిటీలు, కమీషన్లు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

02

## ప్రభుత్వం నడవద్దా..

### రాహు కేతుల్లాంటి ఇద్దరు ఉసిగొల్పుతున్నారు

- కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదదు..?
- తెలంగాణ తల్లి విగ్రహా ఆవిష్కరణకు కేసీఆర్ ను పిలుస్తాం
- బీఆర్ఎస్ నేతల తీరుపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): కేసీఆర్ రాజకీయ సంప్రదాయాలను దెబ్బతీశారని, రాహు కేతుల్లాంటి ఇద్దరు రాక్షసులను ప్రభుత్వం మీదకు ఉసిగొల్పుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండి పడ్డారు. వాళ్ల ఉద్దేశం ఏమిటి.. ప్రభుత్వం నడవద్దా.. అని ప్రశ్నించారు. గురువారం సెక్రటేరియట్ లో ఆయన మాట్లాడుతూ హరీశ్, కేటీఆర్ లతి చిన్నపిల్లల్లాంటి మనస్తత్వమని, తమకు దక్కనిది, పక్కోడి దగ్గరిది


మిగతా 2 లో



## సీఎం రేవంత్ రెడ్డిపై హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు

- గాంధీ భవన్ నుంచి వచ్చే ఆదేశాలతోనే ఎఫ్ఐఆర్ లు
- పగ, ప్రతీకారాలతో సీఎం రేవంత్ రెడ్డి పాలన
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆరోపణలు

.. వివరాలు 2లో



### చెత్త సమస్యను పరిష్కారానికి జీహెచ్ఎంసీ

## కొత్త ప్రణాళికలు

### ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేయాలని నిర్ణయం

హైదరాబాద్, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): గ్రేటర్‌లో చెత్త సమస్యను పరిష్కరించడానికి జీహెచ్ఎంసీ కొత్త ప్రణాళికను రూపొందించింది. చెత్త పేరుకుపోకుండా చేయడంతో పాటు చెత్త కనిపించకుండా

మిగతా 2 లో

## సంక్రాంతికి 10,956 రెవెన్యూ అధికారులను నియమిస్తాం

### రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తాం

### రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి స్పష్టం



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): సంక్రాంతి లోపు రాష్ట్రంలోని 10,956 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ అధికారులను నియమిస్తామని, తద్వారా రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్,

మిగతా 2 లో



### ఎంజీఎంలో ఇందిరా మహిళా

## శక్తి క్యాంటీన్ ప్రారంభం

### మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తాం

మంత్రి కొండా సురేఖ వెల్లడి

వరంగల్, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి అయిందని రోజుకో శాఖను తాను పరిశీలిస్తున్నట్లు మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. అనంతరం ఆమె

మిగతా 2 లో



## తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు షాక్

### ఇరు పార్టీలకు చెందిన ఇద్దరు కాంగ్రెస్ లో చేరిక

హైదరాబాద్, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు షాక్ ఇచ్చారు ఆ పార్టీ నేతలు. ఇరు పార్టీలకు చెందిన ఇద్దరు కీలక నేతలు గురువారం నాడు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీ నేత, మాజీ ఎంపీ సోయం బాబురావు, బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే

మిగతా 2 లో

## మధ్యాహ్న భోజనంపై దాఖలైన పిటీషన్‌పై హైకోర్టులో విచారణ

### పోషకాలతో భోజనం వడ్డించాలని న్యాయస్థానం ఆదేశాలు



హైదరాబాద్, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై దాఖలైన పిటీషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా విద్యార్థులకు పోషకాలతో

మిగతా 2 లో

# చట్టభద్దతను కోల్పోతున్న "స.హ" చట్టం






మొదటి పేజీ తరువాయి

ఫిర్యాదులు 14,000 లకు పైగా ఉన్నట్లు సమాచారం. గత ప్రభుత్వం ఈ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరింది, అయితే ఎన్నికల కారణంగా ప్రక్రియ ఆలస్యమైంది. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం జూన్ 2024 లో మళ్లీ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ ప్రక్రియ కూడా ముగిసి నెలలు గడుస్తున్నా కమిషనర్ల నియామకాలపై ఊసే లేదు. కమిషనర్ల ప్రధాన విధి సెక్షన్ 6(1), సెక్షన్ 19(1) ల పౌర దరఖాస్తులకు చట్టభద్ధమైన గడువు లోపు, తర్వాత కూడా పరిష్కారం జరగని దరఖాస్తుల యొక్క పిర్యాదులు, అప్పిళ్ల పరిశీలన మరియు పరిష్కారం, పౌర సమాచార అధికారులపై చర్యలు. గడువు లోపు సమాచారం అందించని పౌర సమాచార అధికారులు పౌరుల హక్కును అమలు చేయనట్టే.. అంతే కాదు ఇట్టి సందర్భంగా పౌరులకు గడువు లోపు అందని హక్కు చట్టభద్దతను కోల్పోతున్నది. అలాంటిది రాష్ట్రంలో ఏకంగా 20నెలలుగా.. అనగా ఏడాదికి పైగా.. రెండేళ్లకు దగ్గరగా తెలంగాణలో అప్పీళ్లను, పిర్యాదులను పరిశీలించే, చర్యలు తీసుకునే ఒక్క కమిషనర్ కూడా లేకపోవడంతో మండల, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో పరిష్కారం కానీ దరఖాస్తుదారుల దరఖాస్తులు అలానే పెండింగ్ లోనే ఉండి వారి చట్టభద్ధమైన హక్కు చట్టభద్దతను కోల్పోతున్నది. తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ లో కమిషనర్ల నియామకాల ఆలస్యం వెనుక ఉద్దేశ్యపూర్వకమైన నిర్లక్ష్యం ఉందా.. లేక ప్రశ్నించే గోతులను అణిచివేయాలనే ఒక యోచనా.. అనేది పౌరుల్లో మెదుళుతున్న సందేహాలు. అంతే కాక మరీ 20 నెలలుగా కమిషన్లో కమిషనర్లను గత ప్రభుత్వం కానీ.. ప్రస్తుత ప్రభుత్వం కానీ నియమించకపోవడానికి సరైన కారణాలే కానస్తలేవని.. ఏ కారణంగా ఆలస్యం చేస్తున్నాయి ఈ ప్రభుత్వాలు అని పౌరులు ఆగ్రహిస్తున్నారు. హక్కునే అమలు చేయని ప్రభుత్వాలు అభివృద్ధి ఎం చేస్తాయని ప్రశ్నిస్తున్నారు. పథకాలంటూ ఆశ చూపిస్తూ.. పథకాలకు, ఉచితాలకు బానిసలను చేస్తూ.. హక్కులను కాలరాయడమేనా ప్రజా ప్రభుత్వం అంటే అనే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ



పరిస్థితులు అనగా హక్కుల అమలు విషయంలో నిర్లక్ష్యం, ఆలస్యం వల్ల పౌరులు చట్టభద్దత కోల్పోతున్నందున ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి, అసహనం పెరుగుతున్నది. ఈ నియామకాల ఆలస్యం చాలా మంది ప్రభుత్వ అధికారుల మరియు ప్రజా ప్రతినిధుల యొక్క అవినీతి, అక్రమాలను సర్దిద్దుకోడానికి, తప్పించుకోడానికి, రికార్డులను మాయం చేయడానికి వారికి ఈ ఆలస్యం ఒక అవకాశంగా ఉందని స.హ దరఖాస్తుదారులు, ప్రజా సంఘాలు వాపోతున్నాయి. ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల దృశ్యా ప్రభుత్వం ఇప్పటికైనా హక్కు చట్టభద్దతను కోల్పోకుండా ఉండడానికి, పౌరులకు గడువులోపు హక్కు అమలు కావడానికి, అప్పిళ్ల, పిర్యాదుల పరిష్కారానికి, పరిశీలనకై కమిషనర్లను సత్వరమే నియమించాలని, ప్రభుత్వంపై పౌరుల విశ్వాశాన్ని, నమ్మకాన్ని కోల్పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని పౌరులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రభుత్వం నడవద్దా..

మొదటి పేజీ తరువాయి

విరగ్గొట్టే విధానమని అన్నారు. వాళ్లు ఎటమటంగా వ్యవహరిస్తే చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని అన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వమంటే అధికార పక్షంలోని 65 మంది ఎమ్మెల్యేలే కాదని మొత్తం 119 మంది అని సీఎం అన్నారు. ప్రతిపక్ష నేతగా ఉండాలని తెలంగాణ ప్రజలు తీర్పునిచ్చారని, దానిని ఆయన ఎందుకు గౌరవించడం లేదని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత సీటు ఖాళీగా ఉండటం రాష్ట్రానికి మంచిది కాదని అన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ఫాంహౌస్ నిర్మాణం మీద పెట్టిన దృష్టిని పేదలకు ఇండ్లు నిర్మించడంపై పెట్టలేదని విమర్శించారు. కొడుకు, కోడలు వస్తే ఎట్ల అని చెప్పి డబుల్ బెడ్రూం ఆశలు పెట్టిన కేసీఆర్ వాటిని పూర్తి చేయడంపై పెట్టలేదని అన్నారు. వేల ఎకరాల భూమిని వేలం పాటల ద్వారా అమ్మేసిన కేసీఆర్ పేదల ఇండ్ల విషయాన్ని పట్టించుకోలేదని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత కేసీఆర్ కే దక్కిందని అన్నారు. ఆయన చేసిన అప్పులకు ప్రతి నెలా 6,500 కోట్ల మిత్తి కడుతున్నామని ఆయన వివరించారు.

**కేసీఆర్ ను పిలుస్తం**

అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయబోయే తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు మాజీ సీఎం కేసీఆర్ ను ఆహ్వానిస్తామని చెప్పారు. ప్రొటోకాల్ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా వెళ్లి కేసీఆర్ ను ఆహ్వానిస్తారని చెప్పారు. అలాగే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ని పిలుస్తామని అన్నారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో ట్యాంక్ బండ్ ప్రాంతంలో పండుగ వాతావరణం ఉంటుందని, ప్రభుత్వ విజయోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని సీఎం వివరించారు.

## సంక్రాంతికి 10,956 రెవెన్యూ అధికారులను నియమిస్తాం

మొదటి పేజీ తరువాయి

సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. తమ స్వలాభం కోసం వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలను గత ప్రభుత్వం రద్దు చేయడంతో గ్రామాల్లోని ప్రభుత్వ భూముల రక్షణ, రెవెన్యూ శాఖతో ప్రభుత్వానికి సమన్వయం విషయంలో సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ధరణి పోర్టల్‌ను సరళీకృతం చేస్తామని, ఇప్పుడున్న 33 మాడ్యూల్స్ స్థానంలో 11-13 మాడ్యూల్స్ మాత్రమే ఉంచుతామని చెప్పారు. పహాణీల్లో ఇప్పటివరకు ఒక్కటే కాలమ్ ఉందని, ఇక నుంచి 12 లేదా 13 కాలమ్స్ పెడతామని, భూముల పుట్టు పూర్వోత్తరాలన్నింటినీ నమోదు చేస్తామని వెల్లడించారు. 5 లక్షలకు పైగా ధరణి దరఖాస్తులకు పరిష్కారం అధికారంలోకి రాగానే ధరణి ప్రక్షాళన ప్రారంభించాం. ఏడాదిన్నర కాలంగా పెండింగ్‌లో ఉన్న 2.46 లక్షలు, ఈ ఏడాదిలో వచ్చిన 2.60 లక్షల దరఖాస్తులు కలిపి 5 లక్షలకు పైగా దరఖాస్తులను పరిష్కరించాం. ఇంకా 60-70 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ధరణి పునర్నిర్మాణ కమిటీని నియమించాం. 18 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్) చట్టాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నాం. ఈ చట్టం ముసాయిదాను ప్రజల్లో చర్చకు పెట్టాం. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దేశానికి రోల్ మోడల్‌గా ఉండేలా బిల్లు ప్రవేశపెడతాం. అటవీ, రెవెన్యూ, దేవాదాయ, వక్ఫ్ భూముల సరిహద్దు వివాదాలు వచ్చాయి. వీటిని సర్వే చేసి డీ మార్కింగ్ చేస్తాం. ఏ శాఖ భూములు ఆ శాఖకు ఇచ్చేస్తాం. పార్ట్-బీలో ఉన్న భూముల సంబంధిత సమస్యలను పరిష్కరిస్తాం. అసైన్డ్ భూములకు హక్కులు కల్పించే విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. బీఆర్ఎస్ హయాంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు తీసేసుకుంటాం. జీవో 59 కింద పెండింగ్‌లో ఉన్న సరైన దరఖాస్తులను త్వరలోనే పరిష్కరిస్తాం.

## తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు షాక్

మొదటి పేజీ తరువాయి

ఆత్రం సక్కు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. గాంధీ భవన్‌లో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో వీరిద్దరూ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు మహేష్ గౌడ్. ఈ సందర్భంగా తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ చేరికల అంశంపై హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరుతామంటూ సంప్రదింపులు చేస్తున్నారని తెలిపారు. శుభ ముహూర్తం చూసుకుని కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వస్తారని మహేష్ గౌడ్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకం అని చెప్పిన ఆయన కేసీఆర్ ప్రభుత్వం చేసిన ఫిరాయింపులకు, ఇప్పటి ఫిరాయింపులకు తేడా ఉందన్నారు. నాడు కేసీఆర్‌కి పూర్తి మెజార్టీ ఇచ్చినా ఫిరాయింపులు చేశారని విమర్శించారు. ప్రభుత్వాన్ని పడగొడుతాం అంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వచ్చారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలన పట్ల ఆకర్షితులవుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని మహేష్ గౌడ్ పేర్కొన్నారు.

## చల్వాకలో "ముమ్మాటికి" బూటకపు ఎన్కౌంటర్

మొదటి పేజీ తరువాయి

నిరసనగా డిసెంబర్ 9న రాష్ట్ర వ్యాప్తంగా బందు పాటించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ద్రోహి ఇచ్చిన సమాచారంతో డిసెంబర్ 1వ తేదీన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాక గ్రామ పంచాయితీ పరిసర అడవుల్లో పోల్ కొమ్మ వాగు వద్ద తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులు ఏడుగురు విప్లవకారులకు విషమిచ్చి అతి కిరాతంగా చంపారన్నారని కరపత్రంలో ఆరోపించారు. నవంబర్ 30వ తేదీ సాయంత్రం ఏడుగురితో వున్న మా దళం చల్పాక పంచాయితీలో వున్న వలస ఆదివాసీ గ్రామాన్ని కలిసి నమ్మిన వ్యక్తికి తినడానికి భోజనాలు ఏర్పాటు చేయమని చెప్పారని, ముందుగానే పోలీసులకు అప్రూవర్ గా మారిన ఇన్ఫార్మర్ ద్వారా భోజనంలో విషం ఇచ్చి స్పృహం కోల్పేయే లాగా చేశారన్నారు. స్పృహ కోల్పోయిన కామ్రేడ్స్ ను పట్టుకుని చిత్రహింసలు పెట్టి తెల్లవారురుఝామున 4 గంటలకు అతి సమీపం నుండి కాల్చి చంపారని విమర్శించారు. శతృవు మోసపూరిత పథకంలో చిక్కి అమూల్యమైన కామ్రేడ్స్ కురుసం మంగు పాపన్న, భద్రు (తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు), ఏగోలపు మల్లయ్య (మధు, కోటి జెఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ సభ్యుడు), ముచాకీ అందాల్ అలియాస్ కరుణాకర్ (ఇల్లెందు-నర్సంపేట్ ఏరియా కమిటి సభ్యుడు), ముచాకీ బూమే జమున (ఏరియా కమిటీ సభ్యురాలు), పూనెం చోటు కిశోర్ (రీజినల్కంపెనీ-2 మొదటి ప్లటూన్ పార్టీ కమిటి సభ్యుడు), కర్ణం కామాల్ (రీజినల్ కంపెనీ-2లోని రెండవ ప్లటూన్ సభ్యుడు) జైసింగ్ (ఏటూర్ నాగారం- మహదేవ్ పూర్ ఏరియా దళంసభ్యుడు) లు ప్రాణాలర్పించారన్నారు. ప్రజల కోసంప్రాణాలర్పించిన అమరులకు పేరు పేరున తెలంగాణ రాష్ట్ర కమిటీ విప్లవ జోహార్లు అర్పిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన పాశవిక హత్య కాండను తీవ్రంగా ఖండిస్తూ డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర వ్యాప్త బంద్ కు పిలుపునిస్తోందని, యావత్ పీడిత ప్రజలు, ప్రజా స్వామికవాదులు, విద్యాలయాలు, తదితర వ్యాపార సంస్థలుబందును పాటించి జయప్రదం చేయాలని కోరారు. ఈఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఘటనపై న్యాయ విచారణ జరిపి బాధ్యులైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజా ఉద్యమాలను అణిచి వేయడానికి, ప్రజా పోరాటా లకునాయకత్వం వహిస్తున్న మావోయిస్టు పార్టీని, పార్టీ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఆపరేషన్ కగార్ ను కొనసాగిస్తున్నారన్నారు. దామెరతోగు, రఘునాథపాలెం, పూలకొమ్మ తోగు వంటి వరుస ఎన్ కౌంటర్ల పేరుతో హత్యలకు పాల్పడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తున్న ఈ పాశవిక దాడులను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు తీవ్రంగా ఖండించాలని జగన్ కోరినట్లు కరపత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

## మధ్యాహ్న భోజనంపై దాఖలైన పిటీషన్‌పై హైకోర్టులో విచారణ

మొదటి పేజీ తరువాయి

కూడిన భోజనం వడ్డించాలని న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనల్లో నివేదికను సమర్పించాలని సూచించింది. తదుపరి విచారణ 6 వారాలకు వాయిదా వేసింది. భోజనం వికటించిన ఘటనల్లో రెండు కమిటీలు ఏర్పాటు చేసినట్లు ఏఏజీ కోర్టుకు తెలిపారు. బాధ్యులను ఇప్పటికే సస్పెండ్ చేసినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నాణ్యమైన భోజనాన్ని అందించడానికి ఏజెన్సీలకు చెల్లించే డబ్బులను 40శాతం పెంచామని వెల్లడించారు. అయితే, పీఎం పోషణ్ పథకంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలుండాలని పిటీషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. కమిటీల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. కమిటీలు సరిగ్గా పనిచేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరగా అన్ని కమిటీలు పనిచేస్తున్నాయని ఏఏజీ తెలిపారు.




## టీజీపీఎస్సీ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన బుర్రా వెంకటేశం



హైదరాబాద్, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): టీజీపీఎస్సీ నూతన ఛైర్మన్ గా బుర్రా వెంకటేశం గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నాంపల్లిలోని కమిషన్ ఆఫీసులో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇకపై నియామకాల ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా చేపడతామని పేర్కొన్నారు. నిరుద్యోగ అభ్యర్థుల్లో టీజీపీఎస్సీ పట్ల తిరగి విశ్వాసాన్ని నింపుతామని తెలిపిన బుర్రా వెంకటేశం, తమపై పూర్తి నమ్మకంతో పరీక్షలకు హాజరు కావాలని అభ్యర్థులను కోరారు. ఐఏఎస్ కావాలనే తన కలను కష్టపడి నెరవేర్చుకున్నానని, తన స్వంత రాష్ట్రంలో నిరుద్యోగ అభ్యర్థుల కలలు నెరవేర్చడానికి మూడున్నరేళ్ల సర్వీస్ వదులుకున్నానని తెలియ జేశారు. కాగా కమిషన్ ఛైర్మన్ మహేందర్ రెడ్డి పదవీకాలం ఇటీవలే ముగియడంతో, రాష్ట్ర ప్రభుత్వం బుర్రా వెంకటేశంను గవర్నర్ కు సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో గురువారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు.

## నేడు అష్టలక్ష్మీ మహెూత్సవాన్ని ప్రారంభించనున్న ప్రధాని




న్యూ ఢిల్లీ, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): న్యూఢిల్లీలోని భారత మండపంలో ప్రధాని నరేంద్ర మోదీ అష్టలక్ష్మీ మహెూత్సవాన్ని ప్రారంభించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహెూత్సవంలో మొత్తం ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి, చురుకైన వస్త్ర పరిశ్రమ, హస్తకళలు, పర్యాటక అవకాశాలు మరియు ప్రత్యేక ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. 34 జీఐ-ట్యాగ్ చేయబడిన వస్తువులతో సహా 250 మంది కళాకారులు ప్రత్యేకమైన హస్తకళలు, చేనేత మరియు అగ్రి-హార్టీ ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. ఈ ఈవెంట్‌లో ఫ్యాషన్ షో, డిజైన్ కాంక్లేవ్, కొనుగోలుదారు-విక్రేత మీట్ కూడా నిర్వహించబడుతుందని మా కరస్పాండెంట్ నివేదిస్తున్నారు. ఇది అర్థవంతమైన సహకారాలు మరియు దీర్ఘకాలిక ఆర్థిక ప్రభావానికి వేదికను అందిస్తుంది. ఈ పండుగ ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలు - అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం మరియు త్రిపుర నుండి ప్రేరణ పొందింది-సమిష్టిగా అష్టలక్ష్మి అని పిలుస్తారు. ఇది ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక గొప్పతనాన్ని చాటిచెప్పనుంది. ఈ కార్యక్రమంలో ఈశాన్య భారతదేశంలోని ప్రసిద్ధ ముగా మరియు ఏరి సిల్క్‌లకు అంకితమైన పెవిలియన్లు, చేతివృత్తుల చేతిపనుల ప్రత్యక్ష ప్రదర్శనలు మరియు ప్రాంతం యొక్క భౌగోళిక సూచిక ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. మహెూత్సవ్ ఆర్థికాభివృద్ధికి ఉత్ప్రేరకంగా కూడా ఉపయోగపడుతుంది. ఈశాన్య ప్రాంతానికి చెందిన చేతివృత్తులు, చేనేత కార్మికులు మరియు పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది. ఈ ప్రాంతంలోని 320 మంది రైతులు మరియు చేతివృత్తుల వారి ఉత్పత్తులు మరియు కళలను ప్రదర్శించే రూరల్ హాట్ బజార్ అతిపెద్ద ఆకర్షణ.

## లాంఛనంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ పథకం భాగంగా లబ్ధిదారుల వివరాలను అధికారులు యాప్ ద్వారా సేకరించనున్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా మహబూబ్‌నగర్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మెదక్ జిల్లాలను ఎంపిక చేశారు. అయితే, తొలి విడతలో భాగంగా సొంత స్థలం, రేషన్ కార్డు ఉన్న వారికి ప్రాధాన్యతను ఇవ్వాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. ఇక రెండో దశలో స్థలాలు లేని వారికి స్థలం అందించి, ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లుగా తెలుస్తోంది. మొత్తంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గానికి 3,500 చొప్పున 119 నియోజకవర్గాలకు 4,16,500 ఇళ్లు మంజూరు కానున్నాయి. ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టో లో ఉన్న విధంగా ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులకు రూ.5 లక్షల అర్థిక సాయం చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే మార్గదర్శకాలను విడుదల చేసి, ఆ మేరకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబరు 28 నుంచి 2024 జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇల్లు, గృహ జ్యోతి, రైతు భరోసా, చేయూత పథకాలకు దరఖాస్తులను స్వీకరించింది. ఇందులో ఇందిరమ్మ ఇళ్ల కోసం లక్షల్లో దరఖాస్తులు వచ్చాయి. అందులో దాదాపు 30 నుంచి 40 లక్షల మంది అర్హులు ఉండొచ్చుని ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేస్తోంది.

## ప్రశ్నిస్తున్న తెలంగాణ హ్యాష్‌ట్యాగ్‌తో కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు

హైదరాబాద్, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనపై బీజేపీ నేత, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోసారి మండిపడ్డారు. ఈ మేరకు ఆయన గురువారం ఎక్స్ వేదికగా ప్రశ్నిస్తున్న తెలంగాణ హ్యాష్‌ట్యాగ్‌తో కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అంటే కమిటీలు, కమీషన్లు, కాలయాపనలు, ధరణిపై కమిటీ, హైడ్రా, మూసీ, ఫోర్త్ సిటీలతో కమీషన్లు, రైతు భరోసాపై కాలయాపన, అలాంటి కాంగ్రెస్ పాలనలో ఒక్క ఏడాదిలో కాదు ఒక యుగం గడిచినా సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగు పడదు, —వులు, కన్నీళ్ళే కాంగ్రెస్ కలకాలం నడిచే మార్గం' అంటూ పేర్కొన్నారు.

## చెత్త సమస్యను పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ కొత్త ప్రణాళికలు

మొదటి పేజీ తరువాయి

ఉండడానికి ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇటీవలే మలక్‌పేట్ సర్కిల్ పరిధిలోని ఓల్డ్ మలక్‌పేట్ ఏరియాలో గార్బేజ్ కలెక్షన్ సెంటర్ పేరుతో ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన ఖర్చును రాంకీ సంస్థనే భరిస్తుందని అధికారులు చెబుతున్నారు. 1,500 పీలు డస్ట్ బిన్ల లను తొలగించి బిన్ ఫ్రీ సిటీగా మార్చిన చెత్త సమస్య తప్పడంలేదు. డస్ట్ బిన్ లేకపోయినా ఎక్కడిపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. ఈ చెత్త పాయింట్లను 'గార్బేజ్ వర్నరబుల్ పాయింట్ గా గుర్తించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 1500 జీవీపీలు ఉండగా వీటిలో తీవ్రమైన చెత్త ప్రాంతాలు 475 ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ జీవీపీల్లో కార్మికులు ముగ్గులు వేయడంతో పాటు ప్రత్యేకంగా ఓ వ్యక్తిని కాపలగా పెట్టిన చెత్త పేరుకుపోతూనే ఉంది.

**150 గార్బేజ్ కలెక్షన్ సెంటర్లు**

చెత్త ఎక్కువగా పేరుకుపోతున్న ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో గార్బేజ్ కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. 475 తీవ్రమైన చెత్త ఉత్పత్తి ప్రాంతాల్లో మొదటి దశలో 150 సెంటర్లలో చెత్త కోసం ప్రత్యేక క్యాబిన్‌లో రెండు డస్ట్ బిన్‌లు ఉంటాయి. చెత్త వేసినా వాటిలో పడకపోయిన పౌరులకు కనిపించకుండా ఉండేలా క్యాబిన్‌ను రూపొందించారు. ముఖ్యంగా మురికివాడల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

**పెనాల్టీ వేసేందుకు మొబైల్ యాప్**

మురికివాడల్లో గార్బేజ్ కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన జీహెచ్‌ఎంసీ కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన చెత్తను సైతం ఎక్కడిపడితే అక్కడ వేస్తున్నట్టు గుర్తించారు. దీన్ని అరికట్టడానికి భారీగా పెనాల్టీ వేసేవిధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దీనికోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్ తయారు చేస్తున్నట్టు అదనపు కమిషనర్(శానిటేషన్) సీఎన్.రఘుప్రసాద్ తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గురువారం ఉదయం కౌశిక్ రెడ్డి నివాసం వద్ద హరీష్ రావును అదుపులోకి తీసుకున్న పోలీసులు సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎదుట హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. ప్రశ్నించే గొంతులను కాంగ్రెస్ ప్రభుత్వం నొక్కాలని చూస్తోందని అన్నారు. గాంధీ భవన్ నుంచి వచ్చే ఆదేశాల ఆధారంగానే ఎఫ్ఐఆర్ లు నమోదు అవుతున్నాయని కీలక ఆరోపణలు చేశారు. పగ, ప్రతీకారాలతో సీఎం రేవంత్ రెడ్డి పాలన చేస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పోలీసులు రాజ్యాంగానికి లోబడి పనిచేయాలి. ఏడో గ్యారంటీ కింద రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగితే అరెస్టులు చేస్తున్నారని సీరియస్ అయ్యారు. సీఎంగా కాకుండా ఒక గల్లీ నాయకుడిలా రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని హరీష్ రావు ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో నిర్భందాలు, అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయని అన్నారు. ఇదేనా రేవంత్ రెడ్డి తీసుకొచ్చిన మార్పు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి శాశ్వతం కాదని రాజ్యాంగం, చట్టాలే శాశ్వతమని అన్నారు. అది గుర్తుపెట్టుకొని పోలీసులు నడుచుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్‌లు కాంగ్రెస్ కార్యాలయాలుగా మారి పనిచేస్తున్నాయని అన్నారు.

## ఎంజీఎంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగే విధంగా కృషి చేస్తామన్నారు. మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తాం. మొదటి విడుతలలో మహిళ శక్తి క్యాంటీన్ లను ప్రారంభించాం. ఎంజీఎం ఆసుపత్రిలో నూతన ఓపి కేంద్ర ప్రారంభించాం ఆసుపత్రిలో నూతనంగా ఫార్మాసీ కేంద్రం ఏర్పాటు చేశాం, డయాలసిస్ యూనిట్ కేంద్రంను ఏర్పాటు చేస్తాం, మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తాం అని పేర్కొన్నారు. ఎంజీఎం ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉందని ఈ అంశంపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు వెల్లడించారు. త్వరలోనే ఎంజీఎంలో సేవలందించే సిబ్బందిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ ఆస్పత్రిలో వేరే జిల్లాల నుంచి వచ్చిన ప్రజలు కూడా వైద్య సేవలు కోరుకుంటున్నారని తెలిపారు. నిరుపేద ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

## టిజిఆర్టీసీ నూతన లోగో ఆవిష్కరణ

మొదటి పేజీ తరువాయి

విమర్శించారు. కేసీఆర్ పాలనలో ఆకాంక్షలు నెరవేరకపోవడంతో ఉద్యమం చేశారు. కానీ మా ప్రజా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపే కార్యక్రమం చేపడుతోంది. ఆర్టీసీ బస్సుల్లో ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం కల్పించాం. ఆర్టీసీని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. తెలంగాణలో రవాణను కాపాడాల్సిన బాధ్యతమాపై ఉంది. ఇప్పటికే 4వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం అందించింది. నష్టాల్లో కూరుకుపోయిన ఆర్టీసిని లాభాల బాట పట్టించాం. ఇప్పటికి 115 కోట్ల మంది ఉచిత ప్రయాణం చేశారని చెప్పారు. అలాగే డీజిల్ తో నడిచే బస్సులు, ఆటోలను హైదరాబాద్ నగరం అవతలకు పంపిస్తామన్నారు. డీజిల్ ఆటోలు ఔటర్ రింగురోడ్డు అవతల నడిచేలా చూస్తామన్నారు. వచ్చే రెండేళ్లలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొస్తామని చెప్పారు. ఎలక్ట్రిక్ ఆటోలు నడిచేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

# మెపా జిల్లా అధ్యక్షుడిగా అచ్చునూరి కిషన్ నియామకం





### నియామక పత్రం అందజేసిన రాష్ట్ర కమిటీ

ములుగు, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): గురువారం మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర) కార్యాలయం హన్మకొండలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై ములుగు జిల్లా మెపా అధ్యక్షులుగా అచ్చునూరి కిషన్ ముదిరాజ్ ను రాష్ట్ర కమిటీ కార్యవర్గం సూచన మేరకు రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బొట్ల పల్లి సంజీవన్ కుమార్ ముదిరాజ్ లు ఎన్నిక చేసారు. అనంతరం రాష్ట్ర కమిటీ చేతుల మీదుగా కిషన్ ముదిరాజ్' కు నియామక పత్రం అందజేశారు. అనంతరం నూతంగా ఎన్నికైన కిషన్ ముదిరాజ్ మాట్లాడుతూ ములుగు జిల్లాలో అన్ని మండల కమిటీ లు ఏర్పాటు చేస్తానని, జాతి అభివృద్ధి, ఐక్యత కోసం, రిజర్వేషన్ సాధన కోసం కృషి చేస్తానని, ఈ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్, ప్రదాన కార్యదర్శి బోట్ల పల్లి సంజీవన్ కుమార్ ముదిరాజ్, రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఈ సమావేశ ముఖ్య అతిథి మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ముదిరాజ్ లు ఐక్యంగా ఉండి పోరాడాలని అన్నారు. ప్రభుత్వం పైన రిజర్వేషన్ కోసం పోరాటం చేయాలని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యాక్షులు పొన్నం రాజు, రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి ముదిరాజ్ లు సంయుక్తంగా మాట్లాడుతూ ముదిరాజుల కోసం మెపా ఎల్లవేళలా ముందు నడుస్తుందని ముదిరాజుల విద్యా, ఉద్యోగాల కోసం కృషి చేస్తుందని, నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శులు సింగారపు రామ కృష్ణ ముదిరాజ్ , తాళ్ళ రవీందర్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్, దండు చిరంజీవి ముదిరాజ్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యామ్ ముదిరాజ్, జిల్లా సంయుక్త కార్యదర్శి సుంచు ప్రశాంత్, బోల్ల రాజు, ఈరబోయిన వినోద్'లతో పాటు ముదిరాజ్ కుల బందువులు పాల్గొన్నారు.

# వ్యాయామ ఉపాధ్యాయులు, పీడిలతో జిల్లా కలెక్టర్ సమీక్ష



వరంగల్ జిల్లా, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయాల నే ఆలోచనతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ మండల జిల్లా స్థాయి సీఎం కప్ 2024 పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్ ఆదేశాల మేరకు గురువారం వ్యాయామ ఉపాధ్యాయులు మరియు పిడి లందరితో జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలు నందు సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగినది. గ్రామస్థాయి పోటీలను ఈనెల 7 మరియు 8వ తేదీలలో నిర్వహించవలసిందని, మండల స్థాయి సీఎం కప్ పోటీలను 10 నుండి 12 వరకు నిర్వహించడం జరుగుతుందని అలాగే జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు 16 నుంచి 21 వరకు నిర్వహించడం జరుగుతుందని డి వై ఎస్ ఓ సత్యవాణి వివరించారు. అలాగే పోటీల నిర్వహణలో అవలంబించవలసిన నియమ నిబంధనలను మరియు పాటించవలసిన విధివిధానాలను డివైస్ ఓ సత్యవాణి అందరికీ వివరించుతూ వరంగల్ జిల్లాలో వివిధ స్థాయిలో సీఎం కప్ పోటీలు విజయవంతంగా నిర్వహించడానికి తమ వంతు సహకారం అందించగలరని కోరారు. నియమ నిబంధనలకు మరియు ఎంట్రీ ఫారంల యొక్క నమూనాను, నిర్వహించవలసిన క్రీడ అంశముల గురించి న వివరములను ఇవ్వడం జరిగింది. విజయ కుమార్ ఎస్ ఓ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్నటువంటి ఇంత చక్కటి క్రీడా పోటీలలో విద్య శాఖ తరపున మన అందరి సహాయ సహకారాలను అందించాలని తెలంగాణ రాష్ట్రంలో వరంగల్ జిల్లాకి ఎక్కువ పతకాలు లభించేలా కృషి చేయాలని వ్యాయామ ఉపాధ్యాయులకు మరియు పి డీలకు తెలపడం జరిగింది. ఇదే సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పరిచిన సీఎం కప్ ఆప్ గురించి శిక్షణను రాజ్ కుమార్ ఈడీఎం, వరంగల్ ఇవ్వడం జరిగింది. ఇట్టి సమావేశంలో డి ఈ ఓ తరపున విజయకుమార్ ఎస్ఓ, పిఈటి అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకన్నగారు, సెక్రటరీ రఘువీర్ , ఎస్ జి ఎఫ్ ఐ సెక్రెటరీ సారంగపాణి, పిఈటి వైస్ ప్రెసిడెంట్ పెద్దిరాజు గారు, ఎస్ జి ఎఫ్ ఐ మాజీ సెక్రటరీలు పాక శ్రీనివాస్ బొబ్బిలి వెంకన్నతో పాటు వరంగల్ జిల్లాకు సంబంధించిన ఇతర వ్యాయామ ఉపాధ్యాయులు మరియు పిడి లు, డివైస్ ఓ కోచ్ లు అనిల్ కుమార్ కోకో, సుమన్ క్రికెట్ కోచ్ లింగమూర్తి జూడో కోచ్ కుమార్ జూడో కోచ్ రవికుమార్ కబడ్డీ ఇన్చార్జ్, మహేష్ రెజ్లింగ్ ఇంచార్జ్ మరియు డివైఎస్ఓ సిబ్బంది మౌనిక అహమ్మద్ పాల్గొన్నారు.

# నేలల పరిరక్షణ పై రైతులకు అవగాహన కార్యక్రమం







వాజేడు, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): గురువారం వాజేడు మండలం ధర్మవరం గ్రామంలో ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవం సందర్భంగా రైతులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ గారు మాట్లాడుతూ భూమి మనకు ఇచ్చే అపారమైన వనరులలో నేల ముఖ్యమైనది భవిష్యత్ తరాలకు సుస్థిరమైన, సారవంతమైన నేలను అందించాలని కోరారు. నేల సంరక్షణ పాటించాలని, వరి కోసిన తరువాత వరి కొయ్యలను కాల్చకుండ కలియ దున్ని, నీరు పెట్టడం ద్వారా కర్బన పదార్థాన్ని పెంచుకోవచ్చని అన్నారు మరియు పంట మార్పిడి ద్వారా నేలను సంరక్షిచుకోవచ్చని, జీలుగా, పిల్లి పెసర, జనుము వంటి పచ్చి రొట్ట పంటలను సాగు చేసి కలియ దున్నడం ద్వారా నేల యొక్క ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు, వేసవిలో వాలుకు అడ్డంగా దున్నటం వల్ల భూమి కోతను నివారించవచ్చు, ప్రతి ఒక్క రైతు మట్టిని పరీక్షించి పరీక్ష ఫలితాల ద్వారా ఎరువులను వాడాలి, సేంద్రియ ఎరువులను వాడాలని కోరారు. నేల మన సంపద దాన్ని కాపాడటమే మన భవిష్యత్ భద్రత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ హరీష్ మరియు రైతులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ మీట్ తో స్నేహ భావం పెంపొందుతుంది

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): గురువారం, ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా స్పోర్ట్స్ మీట్ ను జిల్లాకేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియం లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా పాల్గొని, మీడియా, రెవెన్యూ బృందాల మధ్య నిర్వహించే క్రికెట్ పోటీని టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా జిల్లా అధికారులకు, మీడియా, పోలీసు, రెవెన్యూ శాఖల బృందాల మధ్య ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల నిర్వహణ వల్ల వివిధ విభాగాల మధ్య స్నేహ భావం పెంపొందుతుందని అన్నారు. ప్రతి నిత్యం ఉద్యోగ బాధ్యతల్లో నిమగ్నమై ఉన్న వారికి ఈ క్రీడా పోటీలు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తుందని తెలిపారు. అలాగే క్రికెట్ లో రెవెన్యూ శాఖ బృందం గెలుపొందగా, రన్నర్ అప్ గా పోలీసు శాఖ బృందం నిలిచారు. అదే విధంగా క్యారమ్స్ లో పి. అరుణ గెలవగా, రన్నర్ అప్ గా పి. శ్రుతి, మ్యూజికల్ ఛైర్ లో ఎం. రజిత గెలవగా, రన్నర్ అప్ గా పి. అరుణ, లెమన్ అండ్ స్పూన్ లో సీహెచ్. ఆరోగ్య మేరీ గెలుపొందగా, పి. శృతి రన్నర్ అప్ గా నిలిచారు. బ్యాడ్మింటన్ లో డీ. విక్రమ్ నెగ్గగా, రన్నర్ అప్ గా రామారావు నాయక్ నిలిచారు. ఈ కార్యక్రమంలో ఏసిపి పార్థసారథి, డీవైఎస్వో వెంకట్ రెడ్డి, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, రెవెన్యూ ఉద్యోగులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం మహిళా ఎంతో ఉపయోగకరం

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): గురువారం, ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా జనగామ డిపోలో నిర్వహించిన కార్యక్రమానికి డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా పాల్గొని, డిపో ఆవరణలో పూలమొక్కను నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు పథకాల్లో భాగంగా మొదటిగా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసిందన్నారు. ఈ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం మహిళా ప్రయాణికులకు చాలా ఉపయోగకరంగా ఉందని, దీంతో వారికి ప్రయాణ ఖర్చులు ఆదా అవుతుందని, ఆ డబ్బులు ఇతర అవసరాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేస్తున్న ఆర్టీసి అధికారులు, సిబ్బంది సేవలను ప్రశంసించారు. ఈ ఉచిత బస్సు పథకం వల్ల మహిళా ప్రయాణికుల సంఖ్య 65 శాతానికి పెరిగిందని, తద్వారా ఆర్టీసికి అధిక ఆదాయం చేకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ ఎస్. స్వాతి, ఏసీపీ పార్థసారథి, సూపర్వైజర్లు, కార్యాలయ సిబ్బంది, గ్యారేజీ సిబ్బంది, డిపో ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ప్రయాణికులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందుకు ప్రభుత్వాన్ని, ఆర్టీసీ సంస్థను కొనియాడారు.

# మెరుగైన వైద్య సేవలను అందించాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



హనుమకొండ జిల్లా, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కమలాపూర్ లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ముప్పై పడకల ఆసుపత్రిలో ఔట్ పేషంట్ విభాగాన్ని పరిశీలించారు. ప్రతి రోజు వైద్య సేవల కోసం ఎంతమంది వస్తున్నారు, ఆసుపత్రి కి సంబంధించిన వాహనాలు ఎన్ని ఉన్నాయి, ఎలా పనిచేస్తున్నాయి, వాటి పరిస్థితి ఏంటి, ఆసుపత్రి లో తాగునీటి పరిస్థితి, ఎక్కడి నుండి వస్తుందనే వివరాలతో పాటు



ప్రసూతి సేవల విభాగాలను పరిశీలించిన కలెక్టర్, ఆస్పత్రికి సంబంధించిన విషయాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ థియేటర్, మందుల విభాగాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు అయ్యేట్టు చూడాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన వృద్ధురాలని ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అప్పయ్య, డిఆర్డీఓ పి.డి. శ్రీనివాస్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ నరేష్, వైద్య సిబ్బంది ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్లో కేసుల పరిష్కారం చేసుకోవాలి

### రాజి మార్గమే రాజా మార్గం నినాదాన్ని చాటుకోవాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణ బాబు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని కోర్టు ప్రాంగణాల్లో డిసెంబర్ పద్నాలుగవ తారీఖున నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసులను పరిష్కారం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ గౌరవనీయులు పి. నారాయణ బాబు సూచనలు చేశారు. జడ్జి మాట్లాడుతూ ప్రజలు ద్వేష భావాలను తగ్గించుకొని రాజి మార్గాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. రాజి మార్గమే రాజా మార్గం అని మనసులో నాటుకోవాలని తెలిపారు, దాంతో విలువైన సమయం, డబ్బు దుర్వినియోగం కాదని అన్నారు. చిన్న చిన్న సమస్యలను పెద్దవి చేసుకొని పంతాలకు పోయి కేసుల్లో ఇరికితే పొలిసు స్టేషన్లు, కోర్టులకు ఎక్కితే నష్టమే తప్ప లాభం ఉండదని జడ్జి అన్నారు. వివిధ కేసుల్లోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్జి పేర్కొన్నారు.

# ప్రభుత్వ భూమిని ఇందిరమ్మ ఇండ్లకు కేటాయించాలి

### - తాహసిల్దార్ కు వినతి..



డిచ్ పల్లి: ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 349 లో గల 7.24 గుంటల ప్రభుత్వ భూమిని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల కు కేటాయించాలని డిచ్ పల్లి తాహసిల్దార్ ప్రభాకర్ కు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజా పంథా) పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజా పంథా) పార్టీ మండల కార్యదర్శి మురళి మాట్లాడుతూ ఘన్పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఇస్లాంపూర్ ,గన్ పూర్ ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. నిరుపేద ప్రజలు అనేక సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారని, సరైన ఉపాధి లేకపోవడం, పిల్లల స్కూలు ఫీజులు, పెరిగిన నిత్యవసర ధరలు తట్టుకోలేక పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ కుటుంబాలను గడుపుతున్నారని అన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీ ల పేరుతో అధికారంలోకి వస్తే నిరుపేదలకు పక్కా ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని, అలాగే సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుందని అన్నారు. నూతన రేషన్ కార్డులు ప్రజలకు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వాని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో గత ప్రభుత్వాలకు పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి సాయ గౌడ్, డివిజన్ నాయకులు మోహన్, కిషన్, భాగ్య, శారద, వడ్డెవ్వ, సుజాత ,జమున, లక్ష్మి, గంగమని తదితరులు పాల్గొన్నారు.

# ఏబిసిడి వర్గీకరణ అమలు చేయాలి

**- మాదిగ సంఘాల మహాకూటమి**

**- చైర్మన్ పోకల కిరణ్ కుమార్**



నేరేడుచర్ల, డిసెంబర్ 05 (తీన్మార్ న్యూస్): ఖమ్మం వెళ్తూ నేరేడుచర్ల లో ఆగి ముఖ్యులను కలిసిన మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్ కుమార్. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముప్పై సంవత్సరాల డిమాండ్ అయిన ఏబిసిడి వర్గీకరణ జరిగే వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాల, మాదిగ లంతా కలిసి ఐక్యంగా నిరంతరం కనురెప్పల ఉంటామని వర్గీకరణ ఆపడం ఎవరి వల్ల కాదని మంద కృష్ణ మాదిగ, వివేక్ వల్ల కూడా కాదని ఎవరు ఏమి చేయలేరని రాష్ట్రంలో రాబోయే 2028 కి రాష్ట్రంలో మాల మాదిగ ఉపకులాల నా సబ్బండ వర్గాలు రాజ్య ధికారం వైపు ప్రయాణం చేయడానికి ఒక గొప్ప వేదిక నిర్మించ బోతున్నామని ఈ రిజర్వేషన్ ఆర్డినెన్సు ఇచ్చిన మరునాడే కృతజ్ఞత సభగా మాల మాదిగ ఉపకులాలు అందరం కలిసి పెద్ద విజయోత్సవ సభని జరప బోతున్నామనీ మందకృష్ణ,వివేకులకు తెలియపరుస్తున్నాను. ఆ సభలో ఇప్పటి వరకు మాకు సహకరించిన ప్రభుత్వాన్ని, అన్ని పార్టీలను,ప్రజా సంఘాల మేధావులను తీసుకొచ్చి అప్పుడు చూపిస్తాం ఏబిసిడి వర్గీకరణ వ్యతిరేకులకు ఐక్యత అంటే అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాల సైదులు,ఉపేందర్,బాలకృష్ణ,శ్రీను,నాగరాజు,రమేష్ పాల్గొనడం జరిగింది.

# డిసెంబర్ 8 వరకు పర్యావరణ పరిరక్షణ వారోత్సవాలు

మహబూబాబాద్: ఐ.డి.ఓ.సి లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం లో జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి మురళీధర్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల సందర్భంగా ప్రతిజ్ఞ సిబ్బందితో చేస్తూ, ఇంటి వద్ద గాని లేదా ఆఫీస్ వద్ద ఒక గదిని విడిచే టప్పుడు నేను అన్ని విద్యుత్ పరికరాలను ఆఫ్ చేస్తానని, నేను ఎక్కువగా ఖాళీ నడకన సైకిల్పై లేదా ప్రజా రవాణా బస్సులలోనే ప్రయాణిస్తానని, నీటిని వృధా చేయకుండా ఉంటానని, నేను నల్ల కుళాయిలను ఉపయోగించిన తర్వాత బందు చేస్తానని , నా వాహనాన్ని కడగడానికి బదులుగా తూడ్చు కోవడానికి , ఇష్టపడతానని చెత్త డబ్బాలో తప్ప మరెక్కడా చెత్తను వేయనని, నేను ఆహారాన్ని వృధా చేయకుండా ఉంటానని, స్థానిక ఆహార పదార్థాలను తింటూ ప్యాకేజ్ ఫుల్ వీలైనంత తక్కువగా తీసుకుంటానని, షాపింగ్ చేసేటప్పుడు నేను ఎల్లప్పుడూ బట్టల సంచి క్లాత్ బ్యాగ్ ను తీసుకు వెళ్తానని, ప్లాస్టిక్ సంచులను ఉపయోగించ నని, మొక్కలను నాటి చెట్లను సంరక్షిస్తానని, ఈ పద్ధతులన్నీ నా చుట్టు పక్కల వారికి నేర్పుతానని,ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వర్రావు, డాక్టర్ సారంగం డాక్టర్ లక్ష్మీ నారాయణ, కె.వి.రాజు హెల్త్ ఎడ్యుకేటర్,హెచ్ ఈ ఓ రామకృష్ణ, గీతా, శారద, డిపిహెచ్ఎన్ఓ మంగమ్మ,డి డి ఎం సోమిత్,రాజ్ కుమార్, కంప్యూటర్ అరుణ్, నీలిమ శ్వేత, సూపరిండెంట్ వాణి, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, డిపిఎం నీలోహన ఆఫీస్ సిబ్బంది

# ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

**- ఎస్సై విజయ్ కొండ డ్రైవర్లకు అవగాహన**



మద్నూర్: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని ఆటో డ్రైవర్ల అందరికీ మద్నూర్ పోలీస్ స్టేషన్ పిలిపించి ఎస్సై విజయ్ కొండ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఆటోలకు సంబంధించిన అన్ని పేపర్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తో పాటు డ్రెస్ కోడ్ పాటించాలని%౯% ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించుకోకూడదని పలు విషయాలపై ఎస్సై ఆటో డ్రైవర్లకు సూచించారు. మద్నూర్ బస్టాండ్ లో నిలిపే ఆటోలు ప్రజలకు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందికరంగా నిల్పకుండా ఉండాలని తెలియజేశారు ..రోడ్డుపై నిలబకుండా వరుస క్రమంలో క్యూలైన్ లో నిలబెట్టుకోవాలని డ్రైవర్లకు సూచించడం జరిగింది. మద్యం తాగి ఆటోలు నడిపితే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించడం జరిగింది. పలు విషయాలపై ఆటో డ్రైవర్లు ఇతర డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కల్పించారు ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్సైతో పాటు పోలీస్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

# రాకాసి పులి మ్యాన్ ఈటర్ గా మారిందా?


అదిలాబాద్ కంటికి కనిపించదు.. డ్రోన్లకు చిక్కదు.. కాని రక్తం మరిగిన పులి వెంటాడుతోంది. వేటాడుతోంది. అదును చూసి పంజా విసురుతోంది. బలి తీసుకుంటోంది. ఒకరి ప్రాణాలు మింగింది.. మరొకరు చావు బతుకుల మధ్య పోరాటం సాగిస్తున్నారు. రాకాసి పులి మ్యాన్ ఈటర్ గా మారిందా? రక్తం రుచి మరిగిన పులి.. మళ్లీ మళ్లీ పంజా విసురుతోంది. కొద్దిరోజుల క్రితం కుమ్రం బీం జిల్లాలోని దుబ్బగూడలో సురేష్‌పై దాడి చేసిన టైగర్.. రాత్రి ఇటిక్యాల్ పహాడ్‌లో లేగదూడపై పంజా విసిరింది. కాబట్టి అది దుబ్బగూడ నుంచి ఇటిక్యాల్ పహాడ్ వైపు వెళ్లిందని స్పష్టమవుతోంది. దీంతో ఇటిక్యాల్ పహాడ్ గ్రామస్తులు భయంతో వణికిపోతున్నారు. ఎప్పుడు ఎటు వస్తుందో, ఎక్కడ మాటు వేసి పంజా విసురుతుందోనని బిక్కచచ్చిపోతున్నారు. ప్రస్తుతం దానాపూర్ సమీపంలో చక్కర్లు కొడుతోంది. లెటెస్ట్‌గా ఓ మేకల మందపై దాడి చేసింది పెద్దపులి. ఓ మేకను కరుచుకొని వెళుతుండగా మేకల కాపరి ఒక్కసారిగా అరవడంతో అక్కడే వదిలేసి పారిపోయింది. పెద్దపులి దాడిలో మేక గాయపడింది. రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరు కొని.. పులి కోసం గాలిస్తున్నారు. ఇటిక్యాల్ పహాడ్‌ను పులి స్థావరంగా మార్చు కుందా!? ఇప్పుడు అందరిలోను ఇదే అనుమానం వ్యక్తమ వుతోంది. అక్కడి నుంచే అటుఇటు తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తోందని భావిస్తున్నారు. అటు, అటవీ సిబ్బంది మాత్రం ఇటిక్యాల్ పహాడ్ దాటితే పులిగండం తప్పినట్టేనని అంచనా వేస్తున్నారు. అవతలివైపు మహారాష్ట్ర ఉంది కాబట్టి.. మనకు సమస్య ఉండదని లెక్కలేస్తున్నారు. మరోవైపు ఏ నిమిషాన పులి పంజా విసురుతుందోనని స్థానిక ప్రజలు భయంతో వణికిపోతున్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లొద్దని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పులి సంచరిస్తున్న గ్రామాల్లో మాస్కులు పెట్టుకోవాలని సూచిస్తున్నారు. మేడ వెనక భాగంలో మాస్కులు పెట్టుకోవాలని.. మాస్క్ ఉంటే పులి దాడి చేయదంటున్నారు.పులి దాడి నుంచి తప్పించుకోవాలంటే ఎలా? అనే అంశంపై స్థానికులకు కొన్ని సూచనలు చేస్తున్నారు అటవీ సిబ్బంది. కొన్నాళ్లు పొలాల్లోకి వెళ్లవద్దని రైతులకు చెప్తున్నారు. ప్రాణాలు కాపాడుకోవాలంటే పనులు మానుకోవాలని కూలీలకూ సూచిస్తున్నారు. మ్యాన్ ఈటర్‌గా మారిన పులిని వీలైనంత త్వరగా బంధించి, ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అయితే పులి మహారాష్ట్ర వైపు వెళ్తోందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇటిక్యాల్ పహాడ్ దాటితే పులి గండం తప్పినట్టేనని అధికారులు బావిస్తున్నారు.

# ఎస్సీ జనాభా దామాషా ప్రకారం వర్గీకరించాలి

**-15 శాతం ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లను అమలుచేయాలి**

**- మాదిగ జాగృతి సంఘం (ఎం జె ఎస్) రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు**

**- నిజామాబాద్ జిల్లా కన్వీనర్ తెడ్డు నాగేశ్వరరావు**




కంఠేశ్వర్ : 15 శాతం ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లను ఎస్సీ జనాభా దామాషా ప్రకారం వర్గీకరించాలి అని మాదిగ జాగృతి సంఘం (ఎం జె ఎస్) నిజామాబాద్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నగరంలోని ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా రాష్ట్రాలలో ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో కూడా 15% ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలని మాదిగ జాగృతి సంఘం ద్వారా కమీషన్ కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో గల ఎస్సీ జనాభాలో 70% ఉన్న మాదిగ జనాభాకు 10 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి. 30% లోపు ఉన్న మాలలకు 4% రిజర్వేషన్లు కేటాయించాలని, 1% లోపు ఉన్న ఎస్సీ ఉపకులాలకు ఒక శాతం రిజర్వేషన్లను కేటాయించాలని సూచించారు. దీనివలన ఇప్పటివరకూ ఈ రిజర్వేషన్ల ఫలాలను తగు రీతిలో అనుభవించని కులాలకు, జనాభా ప్రాతిపదికన సూచించిన విధంగా వర్గీకరించి రిజర్వేషన్లు కేటాయించడం ద్వారా భారత రాజ్యాంగ మూల సూత్రమైన సామాజిక న్యాయాన్ని అమలు చేసినట్లు అవుతుంది ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ ప్రతినిధులు సంతోష్, బాగేంద్ర, రమేష్, సాయినాథ్, రాజు,వినోద్, సురేష్, గంగాధర్, రవి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలో పెట్టుబడిదారీ వ్యవస్థ

**- ప్రపంచ కార్మికులు ఐక్యం కావాల్సిన సమయమిదే**

**- చరిత్ర తెలిస్తేనే సామ్రాజ్యవాదాన్ని దీటుగా ఎదుర్కోగలం**

**- యువతరాన్ని టెక్నాలజీకి బానిసలుగా మారుస్తున్నారు**

**- వారిని చైతన్యవంతుల్ని చేయాలి : రాష్ట్రస్థాయి సదస్సులో**

**- డబ్ల్యూఎఫ్‌టీయూ గౌరవాధ్యక్షులు జార్జియోస్ మావ్రికోస్**




హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉన్నదనీ, ఫలితంగా కార్మిక వర్గం తీవ్రమైన శ్రమ, ఆర్థిక దోపిడీకి గురవుతున్నదని వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యూఎఫ్‌టీయూ) పూర్వ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత గౌరవాధ్యక్షులు జార్జియోస్ మావ్రికోస్ అన్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐయూటీయూసీ సంయుక్తాధ్వర్యంలో "ప్రపంచ ట్రేడ్ యూనియన్ ఉద్యమ చరిత్ర- ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు" అంశంపై బుధవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. దీనిలో ఆయన ప్రధానవక్తగా ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీవర్గం టెక్నాలజీ పేరుతో యువతరాన్ని దోపిడీకి గురిచేస్తున్నదనీ, దీన్ని గుర్తించి వారిని చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత కార్మికసంఘాలపైనే ఉన్నదని దిశానిర్దేశం చేశారు. సౌత్ కొరియాలో కార్మికవర్గం ఐక్యంగా పోరాడి గొప్ప విజయాలు సాధించిందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వలస కార్మికుల సమస్యలు పెరుగుతున్నాయనీ, నిరుద్యోగం పెరగడంతో తక్కువ జీతాలతో సామాజిక భద్రతను వారు కోల్పోతున్నారనీ, వారందర్నీ ఐక్య పరుస్తూ, అండగా నిలవాల్సిన బాధ్యత కార్మికసంఘాలపైనే ఉన్నదని స్పష్టం చేశారు. భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో పోరాటం లేకుండా ఏదీ సాధించలేమనే విషయాన్ని కార్మికవర్గానికి అర్థమయ్యేలా చెప్పాలని సూచిం చారు. 'నాటో' విస్తరణ పెరుగుతూ సామ్రాజ్య వాదబలం పెరుగుతున్నదని హెచ్చరించారు. కేవలం విశాల ఐక్యవేదికల ఏర్పాటు ద్వారానే దీన్ని తిప్పికొట్టగలమని తేల్చిచెప్పారు. యూరప్, ఫ్రాన్స్, పోర్చుగల్ వంటి దేశాల్లో ఐక్యపోరాటాలు మంచి ఫలితాలను ఇచ్చాయనీ, కార్మికవర్గ పోరాటాల చరిత్రను తెలుసుకోవడం ద్వారా ప్రజల్లో ఆశాభావం పెరిగి, బహుళజాతి సంస్థలను సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతామన్నారు. దీనికోసం ప్రపంచ కార్మిక ఐక్యతా పోరాటాల చరిత్రను తెలుసుకోవడం అనివార్యమని స్పష్టంచేశారు. చరిత్రను ఎప్పుడూ రెండు కోణాల్లో చూడాలని విశ్లేషించారు. ఇజ్రాయిల్, పాలస్తీనా దాడికి సంబంధించి 2023 అక్టోబర్ 7న ఇజ్రాయిల్‌పై హమాస్ దాడిచేసినట్టు కనిపిస్తుందనీ, కానీ పాలస్తీనా వైపు నుంచి చరిత్రను అధ్యయనం చేస్తే ఆ దృష్టికోణం వేరుగా ఉంటుందని ఉదహరించారు. సామ్రాజ్యవాదం కేవలం తనకు అనుకూలమైన వాదనను మాత్రమే యువతరానికి, ప్రపంచానికి పరిచయం చేస్తుందని విమర్శించారు. 1945 మే 9న ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని, హిట్లర్‌కు వ్యతిరేకంగా జరిగినట్టు సామ్రాజ్యవాదులు వక్రీకరించి ప్రచారం చేశారని చెప్పారు. అందుకే వాస్తవాలను యువతకు చెప్పకుంటే చరిత్ర వారికి మరోరకంగా అర్థమవుతుందన్నారు. అమెరికాకు వ్యతిరేకంగా వియత్నాం వీరోచిత పోరాటం, 1959 క్యూబా పోరాటం, ఆ తర్వాతికాలంలో జరిగిన స్పెయిన్, ఫ్రాన్స్, పోర్చుగల్ పోరాటాలను యువత, కార్మికవర్గాలు సరైన కోణంలో అర్థంచేసుకోవాలని వివరించారు. డబ్ల్యూఎఫ్‌టీయూగా ప్రపంచ వ్యాప్తంగా అనేక పోరాటాల్లో భాగస్వాములుగా ఉన్నామన్నారు. పాలకవర్గం ఆర్థిక, సామాజిక భద్రతను దోపిడీ చేస్తూ, యువత ఆలోచనా విధానాన్ని నిర్వీర్యం చేసేలా ప్రయత్నాలు చేస్తుందని హెచ్చరించారు. శ్రమశక్తిని గుర్తించేలా, జీతభత్యాలు, సౌకర్యాలు పెరిగేలా, మానవతా దృక్పథం పెరిగేలా నూతన సాంకేతికత ఉండాలన్నారు. కానీ సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు కేవలం లాభాల కోసమే సాంకేతికతను చూస్తుంటారనీ, దీన్నే యువతరానికి అర్థమయ్యేలా చెప్పగలగాలని దిశానిర్దేశం చేశారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో కార్మికవర్గ పోరాటాలు భిన్నంగా ఉన్నా, సమస్యలు మాత్రం ఒకేతరహాలో ఉంటున్నాయనే వాస్తవాలను గమనించాలన్నారు. దానికోసమే అంతర్జాతీయ సంఘీభావంతో పోరాటాలు చేపట్టాలని చెప్పారు. దానికోసమే ఇంటర్నేషనల్ వర్కింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో సదస్సులు నిర్వహిస్తున్నామనీ, కార్మికవర్గ దృక్పథాన్ని ప్రపంచానికి అందించడమే వీటి ఉద్దేశ్యమని స్పష్టంచేశారు. సదస్సుకు సీఐటీయూ, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుక్క రాములు, మహ్మద్ యూసుఫ్ అధ్యక్షత వహించారు. డబ్ల్యూఎఫ్‌టీయూ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి స్వదేశ్ దేవ్‌రారు, ఆఫీస్ బేరర్ అర్కోచౌంతియా అనస్థాసాకి, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐయూటీయూసీ, ఏఐబీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పాలడుగు భాస్కర్, బాలరాజ్, రాజేంద్ర, బీఎస్ రాంబాబు, సీఐటీయూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పాల్గొన్నారు. అంతకుముందు ప్రధాన వక్తను వివిధ సంఘాల నాయకులు సత్కరించారు.

# తెలంగాణ రాష్ట్రంలో భారీ సినిమాల

## బెన్ ఫిట్ షోలు రద్దు చేయాలి




హైదరాబాద్: పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం బెనిఫిట్ షోలను అనుమతించడం , ఈ బెనిఫిట్ షో కు సినిమా నటుడు అల్లు అర్జున్ రావడం అతని కోసం ప్రజలందరు ఒకే సారి గుమిగూడటంతో పోలీస్ లాఠీ చార్జ్ చేయడం వల్లన తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ మృతి చెందింది, శ్రీతేజ్ ఆరోగ్యం విషమంగా ఉందని, శాన్వి అనే పిల్లలు హాస్పటల్ లో చికిత్స పొందుతున్నారని, ఈ కుటుంబానికి ప్రభుత్వం, సినిమా నిర్మాతలు ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేసియా చెల్లించాలని, సంధ్య థియేటర్ ఎదుట %ూఖీ× ణఖీ×% రాష్ట్ర కమిటీ ల ఆద్వర్యంలో ధర్నా నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా SFI రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్. ఎల్. మూర్తి, టి. నాగరాజు, DYFI రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం భారీ సినిమాలకు బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వడం, ధరలు పెంచుకోవడానికి అనుమతులు ఇవ్వడం వలన వినోదానికి బదులు విషాదాలు నిండుతున్నాయని తెలంగాణలో ఎలాంటి సినిమాలకు బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వకుండా చట్టం తేవాలని డిమాండ్ చేశారు. నటుడు అల్లు అర్జున్ బెనిఫిట్ షోలకు అభిమానులు భారీగా వస్తారని అంచనాలు ఉన్న వచ్చి ఒకరి ప్రాణాల పోవడానికి కారణమయ్యాడు. అతనిపై కూడా కేసు నమోదు చేయాలి. పోలీసులు చిన్నచిన్న సంఘటనలకే లా అండ్ ఆర్డర్ అంటారని భారీ క్రేజ్ ఉన్న సినిమాలు వారి అభిమాననటులు పర్యటనలకు పోలీసులు అనుమతి ఇవ్వకుండా ఉండాలి. కానీ అల్లు అర్జున్ వచ్చి భారీగా ప్రజలు గుమిగూడేలా చేసి, పౌరుల ప్రాణాలు పోయేలా చేసిన చర్యలను సుమోటాగా తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తొక్కిసలాటలో చనిపోయిన రేవతి అనే మహిళ కుటుంబాన్ని ప్రభుత్వం, సినిమా నిర్మాతలు ఆదుకోవాలని, వారి పిల్లలు కూడా చావు బ్రతుకుల పోరాటాన్ని కొనసాగిస్తున్నారని, వారి కోసం మెరుగైన వైద్యాన్ని అందించాలని, చనిపోయిన మహిళా కోసం ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా అందించాలని అన్నారు. బెనిఫిట్ షోలు తీస్తున్న సందర్భంలో తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకుండా ప్రాణాలు పోవడానికి కారణమైన సంధ్య థియేటర్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంధ్య థియేటర్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నాయకత్వాన్ని పోలీసులు అన్యాయంగా అరెస్టు చేయడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు, నాయకుల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. నాయకులను అరెస్టు చేసి కాంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్ , రాష్ట్ర సహాయ కార్యదర్శి అశోక్ రెడ్డి, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జావేద్, డివైఎఫ్ఐ హైదరాబాద్ అధ్యక్షులు హస్మీబాబు, రాజు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్ గువేరా, రమేష్ , రమ్య , ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు విగ్నేష్, నాగేందర్, సహన, రజనీకాంత్, ప్రశాంత్ , మనోజ్, లక్ష్మణ్ , రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వాజేడు ఎస్సై ఆత్మహత్య ఘటనలో బిగ్ ట్విస్ట్ !



వరంగల్: ములుగు జిల్లా వాజేడు ఎస్సై హరీశ్ ఆత్మహత్య వ్యవహారంలో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ఓ యువతి (26)తో ప్రేమాయణమే ఆయన బలవన్మరణానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆమె గతం తెలిసి దూరం పెట్టాలనుకోవడం, దీంతో ఆమె ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని బెదిరించడంతో మనస్తాపం చెంది సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నట్టు తెలిసింది.

ఏడు నెలల క్రితం హరీశ్‌కు ఓ యువతి నుంచి ఫోన్ వచ్చింది. ఏవో విషయాలు ఆరా తీస్తూ ఆయనతో మాటలు కలిపింది. ఆపై ఇన్‌స్టాగ్రామ్‌లో ఇద్దరూ చాట్ చేసుకునేవారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆమె హైదరాబాద్‌లో చదువుకుంటోంది. సెలవు రోజుల్లో వాజేడు వచ్చి రెండ్రోజులు ఉండి వెళ్లేది. వారి మధ్య ప్రేమ మరింత ముదిరి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆమె గురించి ఎస్సై ఆరా తీస్తే.. ఆమె ఊర్లో ఉన్నప్పుడు ముగ్గురు యువకులతో స్నేహంగా ఉండేదని, వారిలో ఒకరు పెళ్లికి నిరాకరించడంతో చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఆమె కేసు కూడా పెట్టినట్టు తెలిసింది. అప్పటి నుంచి హరీశ్ ఆమెను దూరం పెట్టడంతోపాటు పెళ్లి ప్రతిపాదనను నిరాకరించి పెద్దలు కుదిర్చిన సంబంధం చేసుకోవాలన్నాడు. అదే విషయాన్ని ఆమెకు చెప్పడంతో ఆదివారం యువతి వాజేడు వచ్చింది. అక్కడ ఇద్దరి మధ్య ఈ విషయమై వాగ్వివాదం జరిగింది. ఆమెతో సెటిల్ చేసుకునేందుకు ఎస్సై ప్రయత్నించినా నిరాకరించింది. అంతేకాకుండా విషయాన్ని ఉన్నతాధికారులకు చెబుతానని బెదిరించడంతో హరీశ్ సోమవారం సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హరీశ్ తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువతిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

# పర్యాటకానికి 'జల' సత్వం

**- జల పర్యాటకం, సాహస క్రీడలకు ప్రాధాన్యం**

**- హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ ను లాంఛనంగా ప్రారంభించిన మంత్రి జూపల్లి**

**- జెట్ స్కి పై హుస్సేన్ సాగర్ లో విహారించిన మంత్రి**

రాష్ట్రంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు జల పర్యాటకం, సాహస క్రీడలకు సరికొత్త రూపు సంతరించుకునే దిశగా సీయం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జల పర్యాటకం అభివృద్ధిలో భాగంగా హుస్సేన్ సాగర్ లో అమరావతి బోటింగ్ క్లబ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ స్పోర్ట్స్ ను మంత్రి జూపల్లి కృష్ణారావు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలిసి మంత్రి జూపల్లి జెట్ స్కి పై హుస్సేన్ సాగర్ లో కాసేపు విహారించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... రాష్ట్రంలోని అందమైన పర్యాటక ప్రాంతాలు, పురాతన, చారిత్రాత్మక ప్రాంతాలతో పాటు టెంపుల్ టూరిజం, జల, సాహస క్రీడల టూరిజానికి అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఇటీవలి కాలంలో వాటర్ స్పోర్ట్స్ విపరీతమైన ప్రజాదరణ పొందుతున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో జల పర్యాటకాన్ని ప్రోత్సహించడం తోపాటు జల విహార అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నీటివనరులను పరిశీలించి పర్యాటక అభివృద్ధికి అనుకూలమైన ప్రాంతాలను గుర్తించే పని ఉన్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రాముఖ్యత వచ్చేలా కృష్ణా నది పరిహాక ప్రాంతంలోని సోమశిల బ్యాక్ వాటర్స్, నాగర్జున సాగర్, ఇతర రిజర్వాయర్లు, హైదరాబాద్ లోని హుస్సేన్ సాగర్, తదితర ప్రాంతాలను తీర్చిదిద్దితే రాష్ట్రంలో జల పర్యాటక రంగం గణనీయంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. పర్యాటక అభివృద్ధి వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని తెలిపారు. హుస్సేన్ సాగర్ ను మంచి నీటి సరస్సుగా మారుస్తామని గత పాలకులు ప్రగాల్భాలు పలికారని, కానీ అవి నీటిమూటలుగానే మారాయని అన్నారు. హుస్సేన్ సాగర్ ను నీటిని శుద్ధి చేసి పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. పర్యాటక రంగాన్ని కూడా గత పదేళ్లలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. సీయం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ రూపొందించి, దాని అమలు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. చాలా చోట్ల ప్రభుత్వ స్థలాలు, ఆస్తులు నిరర్థకంగా ఉన్నాయని వాటిని ఉపయోగంలోకి తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యంతో పర్యాటక రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వానికి వ్యాపారత్మక ధోరణి లేదని, నిరుపయోగంగా ఉన్న వాటిని పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పీపీపీ మోడల్ లో మౌలిక వసతుల కల్పిస్తామని అన్నారు. హుస్సేన్ సాగర్ లో పెద్దలు, పిల్లలు కలిసి వాటర్ స్పోర్ట్స్ ఎంజాయ్ చేసే విధంగా జెట్ స్కి, కయక్, జెట్ అటాక్, వాటర్ రోలర్ (జాబింగ్) ను పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చినట్లు నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మెనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని, తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయాలి

**- రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు**




ఆశా వర్కర్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేసి, కనీస వేతనం ఇవ్వాలని, రెండేండ్ల లెప్రసీ సర్వే డబ్బులు చెల్లించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్ల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏఎన్సీ, బీపీ టెస్టు టార్గెట్ పెట్టకూడదని, స్పూటమ్ డబ్బాలు తేవాలని ఒత్తిడి చేయడం సరికాదని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలని, పారితోషికాల్లో సగం పెన్షన్ నిర్ణయించాలని కోరారు. మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం డీఎంఅండ్హెచ్ఓ హరీష్‌రాజ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్ఓ సీతారాం నాయక్‌కు వినతిపత్రం అందించారు. సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి వైద్య ఆరోగ్య శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఖమ్మంలో ఆశా కార్యకర్తలు ర్యాలీగా కలెక్టరేట్‌లోకి వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలెక్టరేట్ గేట్ ఎదుట బైటాయించి సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందిస్తూ.. కొద్దిగా డబ్బులు వచ్చాయని, చెల్లిస్తామని అన్నారు. ములుగు జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందించి డీఎంహెచ్ఓకు ఫోన్ చేసి పెండింగ్ సర్వేల డబ్బులు వారం రోజుల్లో క్లియర్ చేయాలని ఆదేశించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియం నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వరకు చేరుకొని ధర్నా చేపట్టారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి డీఎంహెచ్ఓ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు.

# బంగ్లాదేశ హిందువుల కోసం కదం తొక్కిన హిందూ ఐక్యవేదిక

**కరీంనగర్ లో భారీ ర్యాలీ... కలెక్టరేట్ ఎదుట నిరసన..**

**బంగ్లాదేశ్లో హిందువులు**

**ఏం పాపం చేశారని దాడులు చేస్తున్నారు..?**

**బంగ్లా హిందువులకు రక్షణ కల్పించాలి...**

కరీంనగర్: బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న నిరంతర దాడులను నిరసిస్తూ కరీంనగర్ హిందూ ఐక్యవేదిక బుధవారం రోజున భారీ నిరసన , ఆందోళన కార్యక్రమం చేపట్టింది. వేలాదిగా తరలివచ్చిన హిందూ జన సమూహంతో కరీంనగర్లోని గోపికృష్ణ ఫంక్షన్ హాల్ నుండి ప్రారంభించిన నిరసన ర్యాలీ పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. ర్యాలీ సందర్భంగా బంగ్లాదేశ్ హిందువులను కాపాడండి, రక్షించండని ప్లకార్డులను ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ వద్ద పీఠాధిపతులు, హిందూ ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్ లో హిందువులు ఏం పాపం చేశారని దాడులు చేస్తున్నారని ప్రశ్నించారు. బంగ్లాదేశ్ లో ప్రజాస్వామ్యం లేదని, హిందువులకు రక్షణ కల్పించమని అడిగినందుకు ఇస్కాన్ స్వామిజీ చిన్మయి కృష్ణ దాస్ ను జైల్లో వేశారని, ఆయనకు అండగా నిలిచిన వారిపై దాడులు చేస్తు మారణ హోమం సృష్టిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా బంగ్లాదేశ్ లో ఇస్లామిక్ తీవ్రవాదుల దాడులు రోజు,రోజుకీఅధికమయ్యాయన్నారు. హిందువులు, ఇతర మతపరమైన మైనార్టీలపై నిరంతరం దాడులు ,హత్యలు, దోపిడీలు, మహిళలపై అమానవీయ వేధింపులు పెరిగిపోతు న్నాయని, ఇది తీవ్రమైన ఆందోళనకరమైన విషయమని, దీన్ని హిందూ ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ముఖ్యంగా బంగ్లాదేశ్ హిందువులు స్వీయ రక్షణ కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో తమ గళాన్ని ఎత్తినప్పుడు , వారి గళాన్ని అణచివేయడానికి బంగ్లాదేశ్ ప్రభుత్వం దుర్మార్గ ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో బంగ్లాదేశ్ లో వరదలొస్తే ఎవరి మతం ఏంటనేది చూడకుండా అన్నం పెట్టిన ఇస్కాన్ పై బంగ్లాదేశ్ నియంత ప్రభుత్వం అణిచివేత ధోరణి అవలంబిస్తుందన్నారు. అందులో భాగంగానే ఇస్కాన్ స్వామిజీ చిన్మయి కృష్ణ దాస్ ను జైల్లో వేసి ఇబ్బంది పెడుతుందన్నారు. స్వామి జీకి అండగా నిలిచిన వారిపై ఉక్కు పాదం మోపుతుందన్నారు. ఇలాంటి చర్యలు సరికావని బంగ్లాదేశ్ ఇప్పటికైనా హిందూ మైనార్టీల పైన జరుగుతున్న దాడులను నివారించడానికి అన్ని విధాలా చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు.బంగ్లాదేశ్ హిందువులకు విశ్వ మానవాళి అండగా నిలబడి సంఘీభావాన్ని వ్యక్తపరచడం అత్యవసరమ న్నారు. బంగ్లాదేశ్ మైనారిటీ హిందువుల రక్షణ కోసం, అక్కడి ప్రజలకు అండగా నిలవడానికి, నైతిక మద్దతు అందించడానికి హిందూ ఐక్యవేదిక నిరంతర ప్రయత్నం చేస్తుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ద్వారా భారత రాష్ట్రపతికి వినతి పత్రం సమర్పించారు. ఇట్టి కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక కరీంనగర్ జిల్లా కన్వీనర్ అనుమండ్ల రాజిరెడ్డి, కో కన్వీనర్లు డా. రమణాచారి, ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, రామ్ కిరణ్, పి .కిషన్, కిరణ్ సింగ్, ఆది శ్రీనివాసరావు, పీఠాధిపతులు శ్రీశ్రీ సనక సనంద స్వామిజీ, పురాణం మహేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

# 10న హైదరాబాద్‌లో వికలాంగుల మహాధర్నా

**- బీఆర్ఎస్, సీపీఐ(ఎం), సీపీఐ, టీజేఎస్, టీడీపీ నాయకులకు ఆహ్వానం**

**- ఎన్‌పీఆర్‌డీ ప్రతినిధి బృందం వెల్లడి**




హైదరాబాద్: వికలాంగులకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 10న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఈ మహాధర్నాకు రాజకీయ పార్టీల నాయకులను బుధవారం ఎన్‌పీఆర్‌డీ ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో కలిసి ఆహ్వానించింది. ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), సీపీఐ, టీజేఎస్, టీడీపీ కార్యాలయాల్లో ఎన్‌పీఆర్‌డీ ప్రతినిధి బృందం కె వెంకట్, ఎం అడివయ్య, ఆర్ వెంకటేశ్, జె మల్లేష్, ఆదర్శ్ కలిసి మహాధర్నాకు హాజరు కావాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వికలాంగులకు ఇచ్చిన హామీ లను అమలు చేయాలంటూ 20 రోజుల నుంచి ఉద్యమం చేస్తున్నామని వివరించారు. వికలాంగుల పెన్షన్ రూ. ఆరు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. మహా ధర్నాకు హాజరవుతామనీ, అసెంబ్లీలో వికలాంగుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామంటూ రాజకీయ పార్టీల నాయకులు హామీ ఇచ్చారని చెప్పారు.

# యువతకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

జయశంకర్ భూపాలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. యువ వికాసం కార్యక్రమంలో భాగంగా, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఐడిఓసి కార్యాలయంలో గ్రూప్-4కు ఎంపికైన అభ్యర్థులకు పెద్దపల్లి సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేయనున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత బస్సులను జెండా ఊపి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడు తూ, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల మేరకు పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టిందని తెలిపారు. మన జిల్లా నుండి ఎంపికైన 101 మంది గ్రూప్ 4 అభ్యర్థులను పెద్దపల్లిలో నియామకపు పత్రాలు తీసుకోవడానికి వెళ్లేందుకు మూడు ఉచిత బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరకాలంలో ఇప్పటివరకు 53 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఆయన వివరించారు. 10 వేలు ఉపాధ్యాయ పోస్టులు, 7,900 వైద్య సిబ్బంది పోస్టులను భర్తీచేసినట్లు తెలిపారు. ఉద్యోగాలు భర్తీకి ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారంగా లక్ష యాభై వేల పోస్టులను భర్తీచేయనున్నట్లు వెల్లడించారు. విద్యా, వైద్యం కీలకమని భావించిన ప్రభుత్వం ఈ రెండు రంగాలను రెండు కళ్లుగా భావించి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో పాఠ్య, నోటు పుస్తకాలు, ఏక రూప దుస్తులు అందచేసామని తెలిపారు. అదేవిధంగా, వసతిగృహాలలో ఉన్న విద్యార్థులకు 40% డైట్ చార్జీలను పెంచామని అన్నారు. రైతులకు మేలు చేసేందుకు 23 వేల కోట్ల రూపాయల రుణమాఫీ అమలు చేసిన ఏకైక ప్రభుత్వం మన రాష్ట్ర ప్రభుత్వమని స్పష్టం తెలిపారు. ఈ సందర్భంగా గ్రూప్ 4 ఎంపికైన అభ్యర్థులు విధుల నిర్వహణలో అంకితభావంతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఈ సందర్భంగా అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ల అశోక్ కుమార్, విజయ లక్ష్మి, నోడల్ అధికారి అవినాష్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన కలెక్టరేట్ ముందు ఆశా వర్కర్లు నిరసన కార్యక్రమం**

జగిత్యాల: వైద్యశాఖ ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు గత రెండేళ్ల క్రితం లెప్రసి,పల్స్ పోలియో ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ,వాటిని చెల్లించిన పిదపనే కొత్త సర్వేలను చేయించాలని సీఐటీయూ జగిత్యాల జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కన్వీనర్ సులోచన ఆధ్వర్యంలో జిల్లాలో పనిచేస్తున్న ఆశాలు పెద్ద ఎత్తున చేరుకుని జిల్లా కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన చేపట్టారు. కలెక్టరేట్ లోకి వెళ్లి సంబంధిత అధికారి కి సమస్యలతో కూడిన వినతిపత్రం ఇద్దామన్న ఆశా వర్కర్లను లోనికి వెళ్ళనియకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు అడ్డుకున్నారు. ప్రభుత్వం మా సమస్యలను తీర్చడంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆశాలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సులోచన మాట్లాడుతూ ఆశాల సర్వే డబ్బుల విషయంలో మా నాయకులు కమిషనర్ కార్యాలయం అధికారులు డబ్బులు విడుదల చేశామని చెబుతు ప్రొసీడింగ్ ఆర్డర్ చుపెట్టారని జిల్లా అధికారులను అడిగితే మాకు రాలేదని నిర్లక్ష్య సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. ప్రొసిండింగ్ ఆర్డర్ ఉంటే డబ్బులు రాలేదని జిల్లా అధికారులు సమాధానం చెబుతున్నారని ప్రభుత్వ అధికారులు రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారని సులోచన మండిపడ్డారు. బకాయిలు చెల్లించకుండా మళ్ళీ డిసెంబర్ 2 నుండి మళ్ళీ లెప్రసి సర్వేలు చేయమనడం సమంజసం కాదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించి పిదపనే కొత్త సర్వేలు చేస్తారని, ప్రభుత్వం ఈ విషయంలో ఆశాలకు న్యాయం చేయాలని ఇందూరి సులోచన కోరారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కి ఆశాలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మమత,సుజాత, లావణ్య, పద్మ, స్వప్న, రజిత, స్వప్న,విజయ, జమున,రూప, యశోద, లక్ష్మి, అనూష, జ్యోతి,సుశీల, భాగ్య,భాగ్యలక్ష్మి,సుగుణ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణపై విచారణకు ఏకసభ్య

## కమిషన్ చైర్మెన్ వినతుల స్వీకరణ

సంగారెడ్డి: సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణపై విచారణ జరపడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మెన్ జస్టిస్ డాక్టర్ సమీమ్ అక్తర్ సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఎస్సీ కుల సంఘాల నుంచి వినతులు స్వీకరించారు. ముందుగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ కుల సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ ఎస్సీ కుల సంఘాల నుంచి 212 వినతులు అందాయన్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి న్యాయపరమైన అంశాలు, సామాజిక పరిస్థితులు, చారిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేయడం కోసం కమిషన్ ఏర్పాటైందని తెలిపారు. సమాజంలోని అన్ని ఎస్సీ వర్గాల అభిప్రాయాలు పరిశీలించి, తగిన నివేదిక సిద్ధం చేస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేక అధ్యయనం కోసం ప్రతిపాదనలు, వినతులు కీలకమైనవన్నారు. కాగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎస్సీ కుల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో బహిరంగ విచారణకు హాజరై కమిషన్‌కు వినతులు అందజేశారు.




అనంతరం కంది మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీని సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ అదనపు సంచాలకులు శ్రీధర్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, సంబంధిత అధికారులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ పార్టీ కారు ...ఖాళీయేనా...

నల్గొండ: ఆ ఉమ్మడి జిల్లాలో గత పదేళ్లు ఒక వెలుగు వెలిగిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు బాగా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుందా ? కారు పార్టీని వలసల టెన్షన్ భయపెడుతుందా ? ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని పన్నెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నేతలంతా మారగా.. ఇప్పుడు మండల, జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సైతం కాంగ్రెస్ లో చేరడంతో కారు ఖాళీ అయ్యిందా ? జిల్లాలో ఉన్న మున్సిపాలిటీలన్నీ కాంగ్రెస్ ఖాతాలోకి చేరడంతో.. పార్టీని నడిపించే నేతలే కరువయ్యారా ? 12 నియోజకవర్గాలు ఉన్న ఉమ్మడి నల్గొండ జిల్లాలో కారు పార్టీ దాదాపు ఖాళీ అయినట్టే కనిపిస్తోందట. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ లో చేరిన నాయకులంతా తిరిగి హస్తం గూటికి చేరుకుంటున్నారు. వలసల పరంపర కొనసాగుతుండగా.. చేరికలను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అగ్రనాయకులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయట. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో పలు సామాజిక వర్గాల ఓటర్లను ప్రభావితం చేయగలిగే ప్రజాప్రతినిధులు అంతా గంపగుత్తగా కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడం గులాబీ బాస్ ని కలవరపెడుతుందట. ఓ పక్క గులాబీ దళం రోజురోజుకీ పడిపోతుంటే.. కాంగ్రెస్ పార్టీ మాత్రం గ్రామ, మండల, పట్టణ స్థాయిల్లో బలపడుతుండడం.. బీఆర్ఎస్ శ్రేణులను అయోమయంలో పడేస్తోందట. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఉన్న రెండు లోకసభ స్థానాల్లో ప్రభావం చూపగల బలమైన నేత.. తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సైతం బీఆర్ఎస్ పై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇక ఆయన కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి కాంగ్రెస్ లో చేరడం.. తెలంగాణ డెయిరీ చైర్మన్‌గా నియమించడం కూడా కాంగ్రెస్ పార్టీకి మరింత ప్లస్ గా మారిందట. దీంతో జిల్లాలో పార్టీని నడిపించే నేతలే లేరని మీమాంసలో ఉన్నారట. అంతే కాకుండా ఉమ్మడి నల్గొండ జిల్లాలో సూర్యాపేట మినహా అన్ని మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. ఎంపీపీలు, జడ్పీటీసీలు, మాజీ సర్పంచులతో పాటు బడా, చోటా లీడర్లు అందరూ గంపగుత్తగా కాంగ్రెస్ గూటికి చేరిపోవడం బీఆర్ఎస్ అధినేతకు తలనొప్పిగా మారిందట. ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్న బీఆర్ఎస్ కు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే నాయకులే కరువయ్యారనే గుసగుసలు వినిపిస్తున్నాయట. మునుగోడు, భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీల్లో? అవిశ్వాస తీర్మానాలతో బీఆర్ఎస్ పాలకవర్గాలను గద్దె దింపారు. ఆయా మండలాలు, గ్రామాల్లో బలమైన సామాజిక వర్గాల ముఖ్యనేతలు కాంగ్రెస్ లో చేరడంతో బీఆర్ఎస్ కు నడిపించే నేతలు కరువయ్యారట. పదేళ్ల బీఆర్ఎస్ పాలన సమయంలో అన్ని పార్టీల నాయకుల రాకతో కిటకిటలాడిన బీఆర్ఎస్ పార్టీకి.. ఇప్పుడు కనీసం స్థానిక నాయకులే లేకుండాపోయ్యారనే చర్చ జోరుగా జరుగుతుందట. ఒక వైపు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోర పరాజయం నుంచి గులాబీ బాస్ కోలుకోకముందే.. పార్టీలో వలసల పర్వం నడుస్తుండడం ఆందోళన కలిగిస్తుందట. అన్ని చక్కబెట్టాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫాం హౌస్ కే పరిమితమవుతున్నారని విమర్శను మూటగట్టుకుంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎక్కడ కనిపించక పోవడం ఆ వాదనలను మరింత బలపరుస్తున్నాయి. ఇక వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆరే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అయితే వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ విఫలం అయ్యారని సొంత నేతలే ఎత్తిపొడుస్తున్నారట. గ్రామస్థాయి నుంచి జిల్లాల వరకు పార్టీ కమిటీలు ఏర్పాటు చేసి ? స్థానిక నేతలకు బాధ్యతలు అప్పగిస్తే వారైనా కనీసం పార్టీ శ్రేణులను యాక్టివ్ చేస్తారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. లేకపోతే స్థానికసంస్థల ఎన్నికల మీద తీవ్ర ప్రభావం చూపి, పోటీ చేయాలంటేనే బీఆర్ఎస్ నేతలు భయపడే పరిస్థితి తలెత్తుతుందని గులాబీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఏ నిర్ణయం తీసుకుంటుంది. పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన బీఆర్ఎస్ ని.. జిల్లాలో నడిపించే నాయకులు వస్తారా ? పార్టీ క్యాడర్ ను యాక్టివ్ చేసే బాధ్యతను ఎవరు తీసుకుంటారని జోరుగా చర్చ జరుగుతుందట. తెలంగాణలో రెండుసార్లు అధికారంలోకి వచ్చి, రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్.. గడ్డు కాలాన్ని అధిగమించేందుకు ఏం యాక్షన్ తీసుకుంటుంది. పార్టీ క్యాడర్ ని మళ్లీ యాక్టివ్ చేసే బాధ్యతలను ఎవరికి ఇస్తారు.. లేదా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ కి పరాభవం తప్పదా అని టాక్ నడుస్తోంది.

# రాకాసి పులి మ్యాన్ ఈటర్ గా మారిందా?

అదిలాబాద్: కంటికి కనిపించదు.. డ్రోన్లకు చిక్కదు.. కాని రక్తం మరిగిన పులి వెంటాడుతోంది. వేటాడుతోంది. అదును చూసి పంజా విసురుతోంది. బలి తీసుకుంటోంది. ఒకరి ప్రాణాలు మింగింది.. మరొకరు చావు బతుకుల మధ్య పోరాటం సాగిస్తున్నారు. రాకాసి పులి మ్యాన్ ఈటర్ గా మారిందా? రక్తం రుచి మరిగిన పులి.. మళ్లీ మళ్లీ పంజా విసురుతోంది. కొద్దిరోజుల క్రితం కుమ్రం బీం జిల్లాలోని దుబ్బగూడలో సురేష్‌పై దాడి చేసిన టైగర్.. రాత్రి ఇటిక్యాల్ పహాడ్‌లో లేగదూడపై పంజా విసిరింది. కాబట్టి అది దుబ్బగూడ నుంచి ఇటిక్యాల్ పహాడ్ వైపు వెళ్లిందని స్పష్టమవుతోంది. దీంతో ఇటిక్యాల్ పహాడ్ గ్రామస్తులు భయంతో వణికిపోతున్నారు. ఎప్పుడు ఎటు వస్తుందో, ఎక్కడ మాటు వేసి పంజా విసురుతుందోనని బిక్కచచ్చిపోతున్నారు. ప్రస్తుతం దానాపూర్ సమీపంలో చక్కర్లు కొడుతోంది. లెటెస్ట్‌గా ఓ మేకల మందపై దాడి చేసింది పెద్దపులి. ఓ మేకను కరుచుకొని వెళుతుండగా మేకల కాపరి ఒక్కసారిగా అరవడంతో అక్కడే వదిలేసి పారిపోయింది. పెద్దపులి దాడిలో మేక గాయపడింది. రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని.. పులి కోసం గాలిస్తున్నారు. ఇటిక్యాల్ పహాడ్‌ను పులి స్థావరంగా మార్చుకుందా!? ఇప్పుడు అందరిలోను ఇదే అనుమానం వ్యక్తమవుతోంది. అక్కడి నుంచే అటుఇటు తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తోందని భావిస్తున్నారు. అటు, అటవీ సిబ్బంది మాత్రం ఇటిక్యాల్ పహాడ్ దాటితే పులి గండం తప్పినట్టేనని అంచనా వేస్తున్నారు. అవతలివైపు మహారాష్ట్ర ఉంది కాబట్టి.. మనకు సమస్య ఉండదని లెక్కలేస్తున్నారు. మరోవైపు ఏ నిమిషాన పులి పంజా విసురుతుందోనని స్థానిక ప్రజలు భయంతో వణికిపోతున్నారు. రైతులు పంట పోలాలకు వెళ్లొద్దని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పులి సంచరిస్తున్న గ్రామాల్లో మాస్కులు పెట్టుకోవాలని సూచిస్తున్నారు. మేడ వెనక భాగంలో మాస్కులు పెట్టుకోవాలని.. మాస్క్ ఉంటే పులి దాడి చేయదంటున్నారు. పులి దాడి నుంచి తప్పించుకోవాలంటే ఎలా? అనే అంశంపై స్థానికులకు కొన్ని సూచనలు చేస్తున్నారు అటవీ సిబ్బంది. కొన్నాళ్లు పొలాల్లోకి వెళ్లవద్దని రైతులకు చెప్తున్నారు. ప్రాణాలు కాపాడుకోవాలంటే పనులు మానుకోవాలని కూలీలకూ సూచిస్తున్నారు. మ్యాన్ ఈటర్‌గా మారిన పులిని వీలైనంత త్వరగా బంధించి, ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అయితే పులి మహారాష్ట్ర వైపు వెళ్తోందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇటిక్యాల్ పహడ్ దాటితే పులి గండం తప్పినట్టేనని అధికారులు బావిస్తున్నారు.

# 11 నుంచి సదర్ క్యాంపులు

హైదరాబాద్: దివ్యాంగులకు పింఛన్ రావాలంటే సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. దీంతో ప్రభుత్వం తరుచూ ఈ క్యాంపులు నిర్వహిస్తోంది. అర్హులైన వారికి ధ్రువపత్రాలు జారీ చేస్తోంది. అయితే.. కొందరు దళారులు సదరం సర్టిఫికెట్ల పేరుతో మోసాలు చేస్తున్నారు. వారిని నమ్మొద్దని అధికారులు సూచిస్తున్నారు. దివ్యాంగులకు సదరం ధ్రువీకరణ పత్రాల మంజూరు కోసం.. ఈనెల 11 నుంచి సదరం శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వరంగల్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కౌసల్యాదేవి ప్రకటన విడుదల చేశారు. 11న మానసిక వికలాంగులకు, 13న మూగ, చెవిటి విభాగానికి చెందిన వారికి సదరం క్యాంపు నిర్వహించనున్నారు. ఆర్థో విభాగానికి చెందిన వారికి 18, 19, 20 తేదీల్లో ఎంజీఎం ఆసుపత్రిలో సదరం క్యాంపులు జరుగుతాయి. కంటి పరీక్షల కోసం వరంగల్ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో క్యాంపు నిర్వహించనున్నారు. దీన్ని 16, 17 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ శిబిరాలకు హాజరు కావాలనుకునే వారు ముందుగా మీసేవలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. సదరం శిబిరాలకు వచ్చేవారు తమ ఎక్స్‌రే రిపోర్టులు, వైద్య ధ్రువపత్రాలు, ఆధార్ కార్డులను తప్పనిసరిగా తీసుకురావాలని.. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కౌసల్యాదేవి సూచించారు. సదరం ధ్రువీకరణ పత్రాల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని స్పష్టం చేశారు. ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలంలోని కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన పేర్ల సంజయ్.. పుట్టు మూగ, దివ్యాంగుడు. ఇతనికి నాలుగేళ్లుగా వికలాంగుల పింఛను ఆగిపోయింది. చచ్చుబడిన కాళ్లతో నడవలేని స్థితిలో కళ్లెదుటే కనిపిస్తున్నా.. జీవిత కాల దివ్యాంగ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడానికి అధికారులు కనికరం చూపడం లేదు.

అయిదేళ్లకోసారి సదరం ధ్రువీకరణ పత్రం రెన్యూవల్ చేసుకొని వస్తేనే పింఛను పునరుద్ధరి స్తామని అధికారులు చెబుతున్నారు. జీవితకాల ధ్రువీకరణ పత్రం కోసం తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని అతని తల్లి ఆవేదన వ్యక్తం చేస్తోంది. పైడిపల్లిలో దివ్యాంగుల కోసం నిర్మించిన ఇళ్లలోకి వెళ్లేందుకు అనుమతించాలని.. కీర్తి వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ డా.సత్యశారదను కలిసి వినతిపత్రం అందజేశారు. పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పాలనాధికారి హామీ ఇచ్చారు.

# శీతాకాలంలో వేడివేడిగా సమావేశాలు

హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాలకు అంతా రెడీ అవుతోంది. ఇటు అధికార పక్షం, అటు విపక్షాలు కూడా అందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నాయి. డిసెంబర్ 9 నుంచి జరగనున్న వింటర్ సెషన్‌లో అపోజిషన్‌ను కార్నర్ చేసేందుకు అధికారి పార్టీ.. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపేందుకు ప్రతిపక్షాలు ప్లాన్ చేస్తున్నాయి. దీంతో ఈ సారి అసెంబ్లీ సెషన్ కాస్త స్పెషల్‌గా ఉండే అవకాశం ఉంది. కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా తాము చేసిన పనులను అసెంబ్లీ వేదికగా బలంగా వినిపించాలని అధికార పక్షం భావిస్తోంది. వన్ ఇయర్‌లో చేసిన అభివృద్ధిని అసెంబ్లీలో చర్చకు పెట్టబోతుందట. ఏడాది కాలంలో రైతాంగానికి 58 వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూర్చినట్లు సభా వేదికగా వివరిస్తారట. 52 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని కూడా చెప్పుకోవాలనుకుంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం. వీటితో పాటు విద్య, వైద్యం అన్ని శాఖల్లో జరిగిన అభివృద్ధిపై వివరిస్తారట. అంతేకాదు బీఆర్ఎస్ హయాంలో జరిగిన అప్పులు..వాటి వడ్డీలు ఇలా అన్ని లెక్కలు అసెంబ్లీ వేదికగా ప్రజల ముందు పెడుతామంటున్నారు హస్తం నేతలు. అయితే ఈసారి అసెంబ్లీ సమావేశాలను గత సెషన్ కంటే బెటర్‌గా యూజ్ చేసుకోవాలని భావిస్తోంది ప్రతిపక్షం బీఆర్ఎస్. ఇప్పటికే ప్రభుత్వ విధానాలపై నిత్యం పోరాడుతూ ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తోంది గులాబీ పార్టీ. అసెంబ్లీ వేదికగా ఆరు గ్యారెంటీలపై గట్టి పట్టు పట్టాలని చూస్తుంది. రుణమాఫీలో లోపాలను వివరించడంతో పాటు ..ఇంకా ఎంతమందికి లోన్ మాఫీ కాలేదో లెక్కలతో సహా వివరించేందుకు రెడీ అవుతోందట. ఇక రైతుబంధుపై కూడా అసెంబ్లీ వేదికగా ప్రశ్నించాలని భావిస్తోంది బీఆర్ఎస్. గురుకులాలు, హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ ఘటనలను ప్రస్తావించనున్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీపై కూడా నిలదీస్తామంటున్నారు గులాబీ నేతలు. పారిశ్రామిక విధానం, మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని బీఆర్ఎస్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. మరో ప్రతిపక్షం బీజేపీ కూడా అధికార పార్టీని నిలదీయాలని భావిస్తోంది. ఇప్పటికీ ఆరు గ్యారెంటీలకు సంబంధించి.. 66 అబద్ధాలు అంటూ ప్రచారం చేస్తుంది. కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జ్‌షీట్‌ను కూడా విడుదల చేసింది బీజేపీ. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు.. తలా కొన్ని సబ్జెక్టులను తీసుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని వ్యూహం రచిస్తోంది కమలదళం. అయితే ప్రతిపక్షాలు ఏయే అంశాలు లేవనెత్తే అవకాశం ఉందో ఇప్పటికే ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. అందుకు తగ్గట్లుగా సమాధానాలు, అవసరమైతే ఎదురుదాడికి కూడా వెనకాడొద్దని వ్యూహ రచన రెడీ చేస్తోందట. బీఆర్ఎస్ హయాంలో ఏ విధంగా శ్వేతపత్రాలు విడుదల చేశారో.. అవసరమైతే ఈసారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలనే ఆలోచన కూడా చేస్తున్నారట కాంగ్రెస్ పెద్దలు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారని.. పదేళ్ల కాలంలో ఒక గ్రూప్-1ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారని ఇలా వివిధ రంగాల్లో బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టాలని అనకుంటుందట కాంగ్రెస్ ప్రభుత్వం. పొలిటికల్‌గా కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేసి విమర్శలు ఎక్కుపెట్టాలని ప్లాన్ సిద్ధం చేస్తుందట. ఇలా ఎవరి వ్యూహాలు వాళ్లకు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి అసెంబ్లీ సెషన్ హాట్ హాట్‌గా కొనసాగే అవకాశం ఉంది. అయితే శాసనసభ సమావేశాలకు ప్రధాని ప్రతిపక్ష నేత, గులాబీ బాస్ కేసీఆర్ హాజరవుతారా లేదా అన్నది మాత్రం సస్పెన్స్‌గానే కొనసాగుతోంది

# సొంత కార్లు అద్దెకు ఇస్తున్నారా!

హైదరాబాద్: అధిక రాబడి ఆశతో కొత్త కార్లు, ఖరీదైన వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులకు అద్దెకు ఇస్తే కోరి కష్టాలను కొని తెచ్చుకున్నట్టే అవుతుంది. ఈఎంఐలపై వాహనాలను కొనుగోలు చేసి వాటిని రెంటల్ ఏజెన్సీలు, లాంగ్ డ్రైవ్‌లకు అద్దెకు ఇస్తే ఏమి జరుగుతుందో తెలుసుకోండి..అదనపు ఆదాయం కోసం ఇంటి వద్ద ఖాళీగా ఉన్న ఖరీదైన కార్లను కిరాయికి ఇచ్చే ధోరణి ఇటీవల కాలంలో పెరుగుతోంది. ఇలా చేయడం వల్ల ఆదాయం రావడంతో పాటు ఏదో ఒక సమయంలో లాభం గుబల్లోకి రావడం కూడా ఖాయం? ఖరీదైన కార్లను అద్దెకు తీసుకుని వాటిని విక్రయించడం, ఇతర ప్రాంతాల్లో అద్దెకు తిప్పడం వంటి మోసాలు ఇటీవల కాలంలో ఎక్కువైంది. సిద్ధిపేటకు చెందిన ఓ యువకుడు ఇలాగే అద్దెకు ఇచ్చి వాటిని విడిపించుకోలేక కడపలో చావు దెబ్బలు తిన్నాడు. వైసీపీ ఎంపీ అనుచరులమంటూ నిందితుల ముఠా కార్ల యజమానిని కిడ్నాప్ చేసి చిత్ర హింసలకు గురి చేసింది. చివరకు రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కర్ణాటకలో తిరుగుతున్న కార్లను విడిపించి బాధితుడికి అప్పగించాల్సి వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి ముఠాలు పదుల సంఖ్యలో ఉన్నాయి,.సొంత కార్లకు అద్దె ఆశ చూపి టోకరా వేస్తున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. హైదరాబాద్‌లో ఓ మహిళ రెండున్నర కోట్ల విలువ చేసే 21 కార్లను మాయం చేసింది. గచ్చిబౌలి టెలికాంనగర్‌లో నివాసంఉండే జూపూడి ఉష డబ్బు కోసం రెంటల్ కార్ ఏజెన్సీ నాటకం ఆడింది. షేక్‌పేట నాలాకు చెందిన డ్రైవర్ తుడుముల మల్లేష్‌తో కలిసి నగరంలో పలువురి వద్ద కార్లను అద్దెకు తీసుకున్నారు. వాటిని కర్ణాటక రాష్ట్రానికి చెందిన సాగర్ పాటిల్, అనిల్ కుమార్‌లకు రూ. 2 లక్షల నుంచి రూ.3 లక్షలు తీసుకుని విక్రయించే వారు. యజమానులు కార్ల గురించి అడిగితే ఉష, మల్లేష్ మాయమాటలు చెప్పేవారు. వారిచేతిలో మోస పోయామని గ్రహించిన కార్ల యజ మానులు నవంబర్ 10న రాయ దుర్గం పోలీసులను ఆశ్రయించారు. నిందితులకు ఓనర్లకు అద్దె చెల్లిస్తామని అగ్రిమెంట్ చేసుకుని వేరే వారికి కార్లను ఇచ్చేస్తున్నారు. సెల్ఫ్ డ్రైవ్ కు కార్లను ఇస్తే నెలనెలా అద్దె చెల్లిస్తామంటూ తీసుకుని వాటిని లీజుకు ఇచ్చేస్తున్నారు. అసలు యజమానులకు మొదట్లో కొంత చెల్లించినా తర్వాత పత్తా లేకుండా పోయేవారు. క్రమంగా అసలు ఓనర్లకు అద్దె చెల్లించకుండా ఇబ్బందులు పెడుతూ వస్తున్నారు. ఈ కేసులో జూపూడి ఉష, తుడుముల మల్లేష్, సాగర్ పాటిల్, అనిల్ జమానేలను రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు కర్ణాటక ప్రాంతంలో అద్దెకు ఇచ్చి అక్కడ తిప్పుతూ వారి నుండి నెలనెలా అద్దె వసూళ్లు చేస్తున్నారు. కార్ల అసలు ఓనర్లకు తమ కారు ఎక్కడ ఉందనే విషయం తెలియదు. నిందితుల వద్ద నుండి కార్లను స్వాధీనం చేసుకున్నారు ఈ కార్లలో మహీంద్రా థార్, మారుతీ సుజుకి ఎర్టిగా, టయోటా ఇన్నోవా, స్విఫ్ట్, హ్యుందాయ్ గ్రాండ్ ఇతర వాహనాలు ఉన్నాయి.

రెంటల్స్‌తో నష్టాలెన్నో?

రెంటల్ కార్లలో అద్దెకు ఇచ్చే కార్లలో వాహనం ప్రయాణించే దూరంపై నియంత్రణ లేకపోవడంతో అవి త్వరగా పాడైపోతాయి. సాధారణంగా రోజుకు రూ.1500 నుంచి రూ.2వేల అద్దెకు కార్లు ఇస్తున్నారు. ఈ క్రమంలో రోజుకు రూ.300 నుంచి 400 కిలోమీటర్లకు మించి దూరం ప్రయాణిస్తే కార్ల జీవిత కాలం తగ్గిపోతుంది. లాంగ్ డ్రైవ్ కార్లలో ఒక్కోసారి సగటున రోజుకు వెయ్యి కిలోమీటర్ల దూరం ప్రయాణించే వారు కూడా ఉంటారు. ఒకటి రెండు రోజుల్లో వేల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే ఇంజన్ సామర్థ్యం తగ్గిపోవడంతో దాని జీవిత కాలం, వారంటీలు త్వరగా పూర్తవుతాయి. రెంటల్ కార్లుగా వినియోగించేందుకు అద్దెకు తీసుకునే వారు వాహనాలు మరమ్మతులకు గురైతే బాగు చేయించేందుకు నిరాకరిస్తున్న ఉదంతాలు ఎక్కువగా ఉంటున్నాయి. వారు చెల్లించే అద్దెతో పోలిస్తే వాహనం రిపేర్లకు అయ్యే ఖర్చు భారీగా ఉంటోంది. చాలా సందర్భాల్లో లాంగ్ డ్రైవ్ అద్దెలకు ఇస్తున్న వాహనాలు కొనుగోలు చేసిన ఏడాదిలోపే గ్యారేజీకి వెళుతున్నాయి. కార్లను అద్దెకు ఇచ్చేటపుడు వాటిని లీజుకు తీసుకున్న వారు ఎలాంటి ఆంక్షలు విధించడం లేదు. ఇలా అద్దెలకు తీసుకున్న కార్లలో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన ఉదంతాలు కూడా ఉన్నాయి. పోలీస్ కేసుల్లో చిక్కుకున్న వాహనాలను అయా సంస్థలు పట్టించుకోవడం లేదు. కొత్త వాహనాలను అద్దెకు ఇవ్వాలనుకుంటే సొంత డ్రైవర్లతో అద్దెకు తిప్పడం తప్ప థర్డ్ పార్టీ అప్లికేషన్లు, ఏజెన్సీలకు అప్పగిస్తే ఆ తర్వాత వాటి మీద ఆశలు వదులుకోవాల్సిందేనని గుర్తుంచుకోవాలి.

# మరింతగా కిన్నెరసాని అందాలు

ఖమ్మం: కిన్నెరసాని.. తెలంగాణలో అద్భుత పర్యాటక కేంద్రం. కిన్నెరసాని ప్రకృతి అందాలను మాటల్లో వర్ణించలేం.. అక్షరాల్లో రాయలేం. ఇక్కడికెళ్లే అహ్లాదం, ఆనందం లభిస్తాయని పర్యాటకులు చెబుతారు. అలాంటి టూరిజం స్పాట్‌పై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తెస్తోంది. పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే ప్రదేశం కిన్నెరసాని. ఇక్కడికి వచ్చే టూరిస్టులను మరింత ఆకర్షించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ పర్యాటకులతో మాట్లాడి.. అభిప్రాయాలు సేకరించారు. అధికారులతో సమీక్షించి కార్యాచరణ ప్రారంభించారు. ప్రకృతి అందాలకు మరిన్ని సొబగులు జోడిస్తున్నారు. కిన్నెరసాని ద్వీపంలో కాటేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఇటీవలే హైదరాబాద్ నుంచి వచ్చిన ఓ సంస్థ బృందం దీనిపై పరిశీలన జరిపింది. వెదురుతో కాటేజీ నిర్మించడానికి అవకాశం ఉన్నట్లు తేల్చింది. వీటిని నిర్మిస్తే పర్యాటకుల చిరకాల కోరిక నెరవేరినట్లే. ఆనంద ద్వీపం దగ్గరకు వెళ్లాలని పర్యాటకులు ఉత్సాహపడతారు. కాటేజీలు నిర్మిస్తే అక్కడి అందాలను వీక్షించడానికి మార్గం సుగమం అవుతుంది. కిన్నెరసాని పర్యాటక కేంద్రం ప్రధాన ద్వారానికి కొత్త కళ తెచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. టోల్‌గేట్ సమీపంలో వెదురుతో రెండు వంతెనలు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇది కూడా త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశముంది. కిన్నెరసాని సమీపంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనువుగా కళా వేదిక నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. వెదురు కళాకృతులతో వేదిక ప్రాంతాన్ని తీర్చిదిద్దనున్నారు. కిన్నెరసాని పర్యాటక కేంద్రంలోని షెడ్‌ను క్యాంటీన్‌గా మార్చాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. దీని నిర్వహణ బాధ్యతలను మహిళలకు అప్పగించాలని భావిస్తున్నారు. ఇక్కడా వెదురుతో తయారు చేసిన బల్లలకే ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు. కిన్నెరసాని కాలువకు రెండుపక్కలా రెయిలింగ్ ఏర్పాటు చేయనున్నారు. పర్యాటకులు కూర్చునేందుకు వీలుగా బల్లలను వేయనున్నారు. ఇక్కడ నీటి ప్రవాహంపై విహరించేందుకు నాటు పుట్టీలు ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఈ పనులు జరిగితే పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినట్టు అవుతుంది. తద్వారా టూరిస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కిన్నెరసానిపై ఫోకస్ పెట్టారు. ఇక్కడ పనులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన నిధులు, అనుమతులు తొందరగా మంజూరు అయ్యేలా తొరవ చూపిస్తున్నారు

# కౌలు రైతుల సమస్యల్ని పట్టించుకోరా?

**- రైతు ఆత్మహత్యల్లో ముప్పావు వంతు వారే**

**- వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాల్సిందే**

**- కౌలు రైతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం : 'కౌలు రైతుల పబ్లిక్ హియరింగ్'లో వక్తలు**

**- పుట్టెడు కష్టాల్లో ఉన్నాం : బాధిత రైతులు**




హైదరాబాద్: 'కౌలు రైతుల కష్టాలు, బాధలు, సమస్యలు తెలిసినా పట్టించుకోరా?' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని 'కౌలు రైతుల పబ్లిక్ హియరింగ్'లో వక్తలు ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షులుగా కౌలు రైతులకు రాసిన బహిరంగ లేఖను ఎప్పుడు అమలు చేస్తారు? అని నిలదీశారు. రైతు ఆత్మహత్యల్లో ముప్పావు వంతు వారేనని ఆవేదన వ్యక్తం చేశారు. 2011 కౌలుదారు చట్టాన్ని అమలు చేయాలని కోరారు. తద్వారా వారికి గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. రాష్ట్రంలోని ముఖ్య రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, కౌలు రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు. కౌలు రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రముఖ జ్యూరీ సభ్యులు ప్రొఫెసర్ హరగోపాల్, సామాజిక కార్యకర్త డాక్టర్ వి.రుక్మిణీరావు, మాజీ ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాలకులు మారినా కౌలు రైతుల బతుకులు మారలేదన్నారు. రాష్ట్రప్రభుత్వం మాత్రం విజయోత్సవాలు చేసుకుంటున్నదని విమర్శించారు. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి కౌలు రైతుల ఆవేదనను వ్యక్తం చేస్తూ భారీ బహిరంగ లేఖ రాశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. రాష్ట్రంలో 22 లక్షల మంది కౌలు రైతులున్నారనీ, సాగు భూమిలో 40శాతం వారే సాగు చేస్తున్నారని తెలిపారు. రైతు ఆత్మహత్యల్లో 80శాతం వారే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. కౌలు రైతులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహిళా కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. భర్తలు ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాల్లో అనేక ఇబ్బందులున్నాయని చెప్పారు. సంసార భారమంతా మహిళా రైతుపై పడుతున్నదన్నారు. బంగారు తెలంగాణలో గ్రామీణ ప్రజల ఆర్థిక స్థితిగతులు మారలేదని తెలిపారు. అడవి జంతులు పంటలను నాశనం చేయడంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారని చెప్పారు. దీనికి నష్టపరిహారమూ అందడంలేదని తెలిపారు.

**కౌలు రైతులకు రుణార్హత కార్డులు ఇవ్వాలి :ఎస్‌కేఎం**

కౌలు రైతులకు 2011 చట్టం ప్రకారం రుణార్హత కార్డులు ఇవ్వాలని ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్లు పశ్యపద్మ, టి.సాగర్, విస్సా కిరణ్, కొండల్, వి ప్రభాకర్, ఆర్. వెంకట్రాములు, పెద్దారపు రమేష్, గౌని ఐలయ్య, భూమయ్య, సోమిడి శ్రీనివాస్, గోనె కుమారస్వామి, కౌలు సంఘాల నాయకులు మాదినేని రమేష్, సూర్యానారాయణ డిమాండ్ చేశారు. రైతుగా గుర్తించడం ద్వారా రైతు బీమా, రైతు భరోసా, బ్యాంకుల ద్వారా రుణాలు, పంటలు నష్టపోయిన సందర్భంగా పంట నష్టపరిహారం కౌలు రైతులకు ఇవ్వాలని తెలిపారు. పండించిన పంటను ఐకేపీ కేంద్రాలు, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవటానికి వెళితే భూ యజమానుల ఖాతాలో డబ్బులు వేస్తున్నారనీ, దీనివల్ల కౌలు రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా కౌలు రైతులకు రైతు భరోసా కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం కూడా కౌలు రైతులను పూర్తిగా విస్మరించిందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నదని విమర్శించారు. ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకోకపోతే మళ్లీ రైతాంగ ఉద్యమాలు తీవ్ర రూపం దాలుస్తాయని హెచ్చరించారు. రైతుల ఆత్మహత్యల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మిల్లర్ల మెడపై డిపాజిట్ భారం

**- ఒకరు తప్పు చేస్తే అందరూ చేసినట్లేనా ?**

**మిల్లులు నడపడం కష్టంగా మారిందని ఆవేదన.**

వరంగల్: తెలంగాణ ప్రభుత్వం మిల్లర్ల మెడపై డిపాజిట్ భారాన్ని మోపిందని జిల్లాలోని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరో కొందరు మిల్లు యజమానులు చేసిన తప్పుకు అందరు బాధ్యత వహించవలసిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన చెందుతున్నారు. వరంగల్ హనుమకొండ జిల్లాలలో సుమారు 160 రైస్ మిల్లులు ఉన్నాయి. వీరిలో కొందరు రైస్ మిల్లు నడపడం కష్టంగా మారిందని గత రెండు మూడు సంవత్సరాలుగా ఖరీఫ్ రబి సీజన్లో వరి ధాన్యాన్ని తీసుకోవడం లేదు. ఈ రెండు జిల్లాలలో ఉన్న మిల్లర్లు తప్పనిసరిగా ఖరీఫ్ పరిధాన్యాన్ని తీసుకొని ప్రభుత్వానికి సహకరించాలన్న రీతిలో జిల్లా అధికారులు ఒత్తిడి తీసుకువచ్చారు. దాంతో చేసేది ఏమీ లేక అధికారుల ఒత్తిడి మేరకు జిల్లాల్లో ఉండబడిన కొందరు రైస్ మిల్లర్లు ముందుకు వచ్చి ప్రభుత్వ ఇచ్చిన టార్గెట్ మేరకు పరిధాన్యాలు సేకరించి బియ్యాన్ని ఎఫ్సీఐకి అందించే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు .ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం గతంలో జరిగిన సంఘటనలు దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది రైస్ మిల్లర్ల యజమానులు ముందస్తుగా బ్యాంకులలో డిపాజిట్ చేయాలని తీసుకోవచ్చారు. అలాంటి మిల్లులకు పరిధాన్యాన్ని దిగుమతి చేసే ఏర్పాటు చేసినట్లు అధికారులు మిల్లర్లు తెలిపారు. దీని కారణంగా మిల్లులను నిర్వహణ కష్టంగా మారిందని మిల్లర్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల మానసికంగా ఆర్థికంగా భారం పడి నష్టపోయే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అనుమకొండ జిల్లాలో 60 రైస్ మిల్లులు ఉండగా 37 మంది రైస్ మిల్లు యజమానులు బ్యాంకులలో నగదు డిపాజిట్ చేసినట్లు అధికారులు తెలిపారు. హనుమకొండ జిల్లాలో పరిధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా జరుగు తుంది. జిల్లాలోని 15 మండలాలలో ఐకెపి కేంద్రాల ద్వారా జిల్లా అధికారులు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. రోజువారిగా ధాన్యం సేకరణకు సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు రైతులకు ఇబ్బందు లు కలగకుండా రెవెన్యూ పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా వరంగల్ జిల్లాలో 11 మండలాలు ఉండగా ఆ జిల్లాలో వరి ధాన్యం సేకరణ ప్రారంభం కాలేదు. ఎక్కువగా నర్సంపేట డివిజన్లో రైతులు వరి పంటను పండిస్తారు ఆ డివిజన్లో వరి కోతల సీజన్ ప్రారంభం కాకపోవడంతో వరిధాన్యం సేకరణ వేగం అందుకో లేకపో యింది. అయినప్పటికీ హనుమకొండ జిల్లాలో రైతులు ఐకెపి కేంద్రాల వద్ద పైగాపులు కాయవలసిన దుస్థితి ఏర్పడిందని రైతులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని రకాల ఏర్పాట్లు చేశామని చెప్పినప్ప టికీ క్షేత్రస్థాయిలో ఎలాంటి ఫలితాలు ఉండటం లేదని రైతులు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం రైస్‌మిల్లర్లపై డిపాజిట్ భారాన్ని మోపిందని మిల్లర్లు అనుకుంటున్నారు. హనుమకొండ జిల్లాలో 60 రైస్ మిల్లులు ఉండగా 37 రైస్ మిల్లర్ల యజమానులు అధికారుల ఒత్తిడి కారణంగా బ్యాంకులలో లక్షల రూపాయలను డిపాజిట్ చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

# పింక్ బాల్ టెస్టు... రోహిత్ బ్యాటింగ్ స్థానం ఎక్కడ?




**టీమిండియా-ఆస్ట్రేలియా మధ్య ఐదు టెస్టుల సిరీస్**
**కొడుకు పుట్టడంతో తొలి టెస్టుకు దూరమైన కెప్టెన్ రోహిత్ శర్మ**
**రోహిత్ స్థానంలో జట్టులోకి వచ్చి రాణించిన కేఎల్ రాహుల్**
**ఓపెనర్ గా రాహుల్ కొనసాగుతాడని రోహిత్ స్పష్టీకరణ**
**తాను మిడిలార్డర్ లో ఏదో ఒక స్థానంలో వస్తానని వెల్లడి**

కొడుకు పుట్టడంతో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తొలి టెస్టుకు దూరమైన సంగతి తెలిసిందే. పెర్త్ లో జరిగిన ఆ మ్యాచ్ లో రోహిత్ స్థానంలో కేఎల్ రాహుల్ ఓపెనర్ గా బరిలో దిగాడు. ఆ మ్యాచ్ లో కేఎల్ రాహుల్ తొలి ఇన్నింగ్స్ లో 26, రెండో ఇన్నింగ్స్ లో 77 పరుగులతో రాణించాడు. ఫాస్ట్ అండ్ బౌన్సీ పిచ్ పై రాణించిన రాహుల్ ను జట్టులోంచి తప్పించే పరిస్థితి లేదు. ఇప్పుడు, రోహిత్ శర్మ రెండో టెస్టు కోసం జట్టుతో కలిశాడు. ఈ నేపథ్యంలో, జట్టులో రోహిత్ శర్మను ఏ ఆర్డర్ లో పంపాలన్నది టీమ్ మేనేజ్ మెంట్ ను ఆలోచనలో పడేసింది. దీనిపై రోహిత్ శర్మ స్వయంగా వివరణ ఇచ్చాడు. తొలి టెస్టులో యశస్వి జైస్వాల్-కేఎల్ రాహుల్ జోడీ చక్కగా ఆడిందని, ఆ జోడీని విడదీసే ఆలోచన లేదని స్పష్టం చేశాడు. అందుకే, తాను ఓపెనర్ స్లాట్ లో కాకుండా, మిడిలార్డర్ లో దిగుతానని రోహిత్ శర్మ వెల్లడించాడు. ఓపెనింగ్ కు అలవాటుపడిన బ్యాట్స్ మన్ కు మిడిలార్డర్ లో ఆడడం ఏమంత సులభం కాదని, కానీ జట్టు కోసం ఏం చేసేందుకైనా తాను సిద్ధమేనని అన్నాడు. "పెర్త్ టెస్టులో ఓపెనర్ గా దిగిన కేఎల్ రాహుల్ తన ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. అందుకే బ్యాటింగ్ ఆర్డర్ ను మార్చదల్చుకోలేదు... ఆ అవసరం కూడా కనిపించడంలేదు. భవిష్యత్తు గురించి ఇప్పుడే ఆలోచించడంలేదు. ప్రస్తుతానికి నేను మిడిలార్డర్ లో ఏదో ఒక స్థానంలో బ్యాటింగ్ కు దిగుతాను" అని రోహిత్ శర్మ వివరించాడు. కాగా, బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా (డిసెంబరు 6) టీమిండియా-ఆస్ట్రేలియా మధ్య రెండో టెస్టు ప్రారంభం కానుంది. ఇది డే/నైట్ విధానంలో పింక్ బాల్ తో జరగనుంది. ఈ ఐదు టెస్టుల సిరీస్ లో టీమిండియా తొలి టెస్టును గెలిచి 1-0తో ఆధిక్యంలో ఉంది.

# యాడ్స్ లో ధోని హవా... బాలీవుడ్ స్టార్లకు మించి క్రేజ్




**42 బ్రాండ్లకు ప్రచారకర్తగా మిస్టర్ కూల్**
**వచ్చే ఏడాది ఐపీఎల్ తర్వాత ధోనీ చేతికి మరిన్ని బ్రాండ్లు!**
**బిగ్ బీ 41, షారుక్ ఖాన్ 34, కోహ్లీ చేతిలో 21 బ్రాండ్లు**

టీమిండియా మాజీ కెప్టెన్, మిస్టర్ కూల్ మహేంద్ర సింగ్ ధోనికి యాడ్స్ లో విపరీతమైన క్రేజ్ ఉందని టామ్ మీడియా రీసెర్చ్ లో వెల్లడైంది. బాలీవుడ్ స్టార్లకన్నా ఎక్కువ బ్రాండ్లకు ధోనీ ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నారు. ఏడాది పొడవునా సినిమాలు, టీవీ కార్యక్రమాలతో ప్రజల్లోనే ఉండే సెలబ్రిటీలకన్నా రెండు నెలల పాటు ఐపీఎల్ మ్యాచ్ లు ఆడే ధోనీతోనే తమ బ్రాండ్లకు ప్రచారం చేయించుకోవడానికి కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయట. టామ్ మీడియా రీసెర్చ్ ప్రకారం... ధోనీ ప్రస్తుతం 42 బ్రాండ్లకు సంబంధించిన యాడ్స్ లో కనిపిస్తుండగా, బిగ్ బీ అమితాబ్ బచ్చన్ 41 బ్రాండ్లకు, షారుక్ ఖాన్ 34, అక్షయ్ కుమార్ 28, సౌరభ్ గంగూలీ 24, విరాట్ కోహ్లీ 21, రణ్వీర్ సింగ్ 21 బ్రాండ్ లకు ప్రచారం చేస్తున్నారు.

ఐదేళ్ల కిందటే అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న ధోనీ 2024 సంవత్సరం తొలి అర్ధభాగంలో భారీ సంఖ్యలో యాడ్స్‌తో మెరిశాడు. ధోనీ కనిపించే యాడ్స్ లలో సిట్రాన్, డ్రోన్ స్టార్టప్ గరుడ ఎయిరోస్పేస్, ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన క్లియర్‌ట్రిప్, పెప్సీ కో, ఈమోటోరాడ్, మాస్టర్ కార్డ్, గల్ఫ్‌ఆయిల్, ఓరియంట్ ఎలక్ట్రిక్ తదితర కంపెనీలు ఉన్నాయి. దీంతో పాటు ఝార?ండ్ ఎన్నికల కమిషన్ రూపొందించిన ఓటు హక్కు విలువను తెలిపే యాడ్ లోనూ ధోనీ కనిపించాడు. వచ్చే ఏడాది జరగనున్న ఐపీఎల్ సందర్భంగా ధోనీ బ్రాండ్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని బిజినెస్ వర్గాలు చెబుతున్నాయి.

# బుమ్రా బౌలింగ్‌లో కోహ్లీ బ్యాటింగ్...




**అడిలైడ్ టెస్టుకు ముందు ప్రాక్టీస్ చేసిన భారత ఆటగాళ్లు**
**బుమ్రా బౌలింగ్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసిన విరాట్ కోహ్లీ**
**సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో**

వరల్డ్ క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాట్స్‌మన్లలో విరాట్ కోహ్లీ ఒకడనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాగే ప్రపంచ మేటి బౌలర్లలో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో నిలుస్తాడు. మరి వీరిద్దరూ పరస్పరం ఎదురుపడితే?... బుమ్రా బౌలింగ్‌లో కోహ్లీ బ్యాటింగ్ చేస్తే ఎలా ఉంటుంది?... ఆ సీన్ ఎలా ఉంటుంది?... అనేది అత్యంత ఆసక్తికరం.

వీరిద్దరూ పరస్పరం తలపడే సందర్భాలు చాలా అరుదుగా ఉంటాయి కాబట్టి బుమ్రా బౌలింగ్‌లో కోహ్లీ బ్యాటింగ్‌ను చూడాలని సగటు క్రికెట్ అభిమానులు కోరుకుంటుంటారు. అలాంటి వారి కోసం 'స్టార్ స్పోర్ట్స్' ఒక ఆసక్తికరమైన వీడియోను షేర్ చేసింది.

భారత్ – ఆస్ట్రేలియా జట్ల మధ్య శుక్రవారం నుంచి అడిలైడ్ వేదికగా మొదలు కానున్న రెండవ టెస్ట్ మ్యాచ్‌కు ముందు నిర్వహించిన ప్రాక్టీస్ సెషన్‌లో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. విరాట్‌కు జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్ చేశాడు. నిప్పులు చెరిగే బంతులను బుమ్రా సంధించగా... కోహ్లీ డిఫెన్స్ ఆడాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ బ్రాడ్‌కాస్టర్ అయిన స్టార్ స్పోర్ట్స్ షేర్ చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

బుమ్రా బౌలింగ్‌లో కోహ్లీ బ్యాటింగ్ చేయడాన్ని భారత శిబిరంలోని మిగతా ఆటగాళ్లందరూ చూస్తుండడం వీడియోలో కనిపించింది. కాగా వీరిద్దరూ ప్రాక్టీస్ సెషన్‌లో ఒకరినొకరు ఎదుర్కోవడానికి ఇష్టపడరు. అయితే ఐపీఎల్‌లో పరస్పరం ఎదురుపడిన పలు సందర్భాలను అభిమానులు ఆస్వాదించిన విషయం తెలిసిందే.

# భారత్‌తో రెండో టెస్ట్.. జట్టును ప్రకటించిన ఆస్ట్రేలియా..




**ఈ నెల 6 నుంచి అడిలైడ్‌లో పింక్ టెస్ట్ ప్రారంభం**
**గాయం కారణంగా స్టార్ బౌలర్ హేజెల్‌వుడ్ దూరం**
**అతడి స్థానంలో స్కాట్ బోలాండ్‌కు స్థానం**
**2021-22లో యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ పనిపట్టిన బోలాండ్**
**ఏడు పరుగులిచ్చి ఆరు వికెట్లు నేలకూల్చిన బౌలర్**
**ఒకే ఒక్క స్పిన్నర్‌తో బరిలోకి ఆతిథ్య జట్టు**

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్‌తో అడిలైడ్‌లో 6 నుంచి ప్రారంభం కానున్న రెండో టెస్ట్ (పింక్‌బాల్ టెస్ట్)కు ఆస్ట్రేలియా జట్టును ప్రకటించింది. గాయం కారణంగా స్టార్ పేసర్ జోష్ హేజెల్‌వుడ్ ఈ టెస్టుకు అందుబాటులో ఉండడం లేదు. అతడి స్థానంలో ప్రమాదకర బౌలర్ స్కాట్ బోలాండ్ జట్టులోకి వచ్చాడు. అతడి షార్ట్ కెరియర్‌లో అద్భుతమైన ప్రతిభ కనబర్చినప్పటికీ సుదీర్ఘకాలం పాటు జట్టుకు దూరంగా ఉన్నాడు. ఇప్పుడు హేజెల్‌వుడ్ స్థానంలో అతడికి చోటు దక్కింది.

2021-22 యాషెస్ సిరీస్ మూడో టెస్టులో అరంగేట్రం చేసిన బోలాండ్ ఇంగ్లండ్‌కు ముచ్చెమటలు పట్టించాడు. ఏడు పరుగులిచ్చి ఏకంగా ఆరు వికెట్లు నేలకూల్చాడు. అతడి దెబ్బకు విలవిల్లాడిన ఇంగ్లండ్ 68 పరుగులకే ఆలౌట్ అయింది. ఇప్పటి వరకు 10 టెస్టులు ఆడిన బోలాండ్ 35 వికెట్లు తీసుకున్నాడు.

ఉస్మాన్ ఖావాజా, నాథన్ మెక్ స్వీనీ బ్యాటింగ్ ప్రారంభిస్తారు. మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్ వరుసగా బ్యాటింగ్ చేస్తారు. అలెక్స్ కేరీ వికెట్ కీపర్. బౌలింగ్ విషయానికి వస్తే పాట్ కమిన్స్ బౌలింగ్ దళాన్ని లీడ్ చేస్తాడు. మిచెల్ స్టార్క్, స్కాట్ బోలాండ్ పేసర్లు కాగా, ఒకే ఒక్క స్పిన్నర్ నాథన్ లియాన్‌తో బరిలోకి దిగుతోంది.

ఆస్ట్రేలియా జట్టు: ఉస్మాన్ ఖావాజా, నాథన్ మెక్ స్వీనీ, మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్, అలెక్స్ కేరీ, పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్, స్కాట్ బోలాండ్.

# హర్మన్ ముందు కఠిన పరీక్ష




**నేడు భారత్-ఆస్ట్రేలియా తొలి వన్డే**

బ్రిస్బేన్ : వచ్చే ఏడాది జరగనున్న ఐసీసీ వన్డే ప్రపంచకప్‌కు సిద్ధమయ్యే ముందు భారత మహిళలజట్టు పటిష్ట ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. బ్రిస్బేన్ వేదికగా గురువారం నుంచి భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఐసీసీ టి20 ప్రపంచకప్ ముగిసిన అనంతరం స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో చేజిక్కించుకున్న ఉత్సాహంతో ఈ పర్యటనకు హర్మన్‌ప్రీత్ సేన సిద్ధమైంది. ఇక ఆస్ట్రేలియా జట్టు వరుసగా 16 వన్డేల్లో విజయాల రికార్డును మరింత పటిష్ఠం చేసుకొనే ప్రయత్నంలో ఉంది. భారతజట్టు ఇప్పటివరకు ఆస్ట్రేలియాపై కేవలం నాలుగు వన్డేల్లో మాత్రమే విజయాలను నమోదు చేసుకోగా.. చివరిసారిగా 2021లో ఆస్ట్రేలియాతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 1-2తో కోల్పోయింది.

ఈ ఏడాది మార్చి తర్వాత ఆసీస్ మహిళల జట్టు తొలిసారి వన్డే సిరీస్‌లో పాల్గోనుంది. రెగ్యులర్ కెప్టెన్ అలైసా హీలీ మోచేతి గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరం కాగా.. తాహియా మెక్ గ్రాత్ సారథ్యంలో ఆసీస్ బరిలోకి దిగుతోంది. భారతజట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన చివరి ఆరు వన్డేల్లో 75యావరేజ్‌తో ఏకంగా 448పరుగులు చేసి అద్భుత ఫామ్‌లో ఉంది. ఈ ఏడాది జరిగిన ఐసీసీ టి20 ప్రపంచకప్‌లో టీమిండియా సెమీస్‌కు చేరడంలో విఫలం కావడంతో హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. ఆసీస్‌తో జరిగిన చివరి రెండు వన్డేల్లో హర్మన్ రెండంకెల స్కోర్ చేయడంలో విఫలమై తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. మిడిలార్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ రాణిస్తే భారత్ భారీస్కోర్ నమోదు చేయడం ఖాయం.

మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో గాయపడ్డ వికెట్ కీపర్ యాస్టికా భాటియా లేకుండానే భారత్ బరిలోకి దిగుతోంది. ఆమె స్థానంలో ఉమా ఛెత్రీ టీమిండియా జట్టులో తొలిసారి చోటు దక్కించుకుంది. స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ రీచా ఘోష్ తిరిగి జట్టులో చోటు దక్కించుకోగా.. హర్లిన్ డియోల్, మిన్ను మణికి తొలి వన్డేలో చోటు దక్కడం ఖాయం. తొలి వన్డే జరిగే బ్రిస్బేన్‌లో వాతావరణం వేడి, తేమతో పాటు తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు ఇక్కడి వాతావరణ శాఖ ప్రకటించింది.

# టీ20లో సంచలనం... వరల్డ్ రికార్డు బ్రేక్ చేసిన బరోడా!




**సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా సిక్కిం, బరోడా మ్యాచ్**
**నిర్ణీత 20 ఓవర్లలో 349/5 పరుగులు చేసిన బరోడా**
**ప్రపంచ టీ20 చరిత్రలో ఇదే అత్యధిక స్కోర్**
**అలాగే బరోడా ఇన్నింగ్స్ లో 37 సిక్సులు**
**దీంతో బరోడా పేరిట మరో ప్రపంచ రికార్డు**

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మరో సంచలనం నమోదైంది. ఇండోర్ వేదికగా సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో బరోడా నిర్ణీత 20 ఓవర్లలో 349/5 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. టీ20 చరిత్రలో ఇదే అత్యధిక స్కోర్. ఈ సందర్భంగా అక్టోబర్‌లో గాంబియాపై జింబాబ్వే 344/4 రికార్డును బరోడా బ్రేక్ చేసింది. అలాగే మరో ప్రపంచ రికార్డును కూడా తన పేరున లిఖించుకుంది. బరోడా తన ఇన్నింగ్స్ లో మొత్తం 37 సిక్సులు కొట్టింది. ఇంతకుముందు ఈ రికార్డు జింబాబ్వే (27) పేరిట ఉండేది.

ఇక బరోడా బ్యాటర్లలో భాను పూనియా కేవలం 51 బంతుల్లోనే 134 పరుగులతో ఊచకోత కోశాడు. అతడి ఇన్నింగ్స్ లో 15 సిక్సర్లు, 5 ఫోర్లు ఉన్నాయి.

42 బంతుల్లోనే శతకం నమోదు చేశాడు. ఇందులో మొదటి అర్ధ శతకం 20 బంతుల్లోనే వస్తే, రెండోది 22 బంతుల్లో వచ్చింది. అలాగే శివాలిక్ శర్మ (17 బంతుల్లో 55), అభిమన్యు సింగ్ (53), సోలంకి (16 బంతుల్లో 50) హాఫ్ సెంచరీలతో రాణించారు.

# టీమిండియా ముమ్మర సాధన



అడిలైడ్: ఆస్ట్రేలియాతో అడిలైడ్ వేదికగా శుక్రవారం నుంచి జరిగే రెండో టెస్టు మ్యాచ్ కోసం టీమిండియా ముమ్మర సాధన చేస్తోంది. డేనైట్ పద్ధతిలో ఈ మ్యాచ్ జరుగనుంది. బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ ఐదు మ్యాచ్‌ల టె స్టు సిరీస్‌లో భారత్, ఆస్ట్రేలియా జట్లు తలపడుతున్న సంగతి తెలిసిందే. పెర్త్ వేదికగా జరిగిన మొదటి టెస్టులో భారత్ ఘన విజయం సాధించి సిరీస్‌లో 10 ఆధిక్యం లో నిలిచింది. మొదటి టెస్టులో కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ ఆటగాడు శుభ్‌మన్ గిల్ లేకుండానే బరిలోకి దిగిన భా రత్ చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. ఇక పింక్ బాల్ టెస్టులో భారత్ మరింత ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్‌లు ఈ మ్యాచ్‌కు అందుబాటులోకి వచ్చారు. దీంతో భారత జట్టు ఆత్మ వి శ్వాసం మరింత పెరిగింది. డేనైట్ మ్యాచ్ కోసం టీమిండి యా ఆటగాళ్లు కఠోర సాధన చేస్తున్నారు. కొన్ని రోజులు గా భారత క్రికెటర్లు నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నారు. సీ నియర్లు రోహిత్, బుమ్రా, కోహ్లి, అశ్విన్, జడేజా, కుల్దీప్, రాహుల్ తదితరులతో పాటు యువ ఆటగాళ్లు కూడా సా ధనలో పాల్గొంటున్నారు. ఆస్ట్రేలియాతో పోల్చితే డేనైట్ టెస్టు మ్యాచుల్లో ఆడిన అనుభవం టీమిండియాకు తక్కు వగా ఉంది.

# జైషా వారసుడెవరో?




**బిసిసిఐ కార్యదర్శి పదవిపై సర్వత్రా ఆసక్తి**

ముంబై: ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ బోర్డుగా పేరున్న భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ)లో కార్యదర్శి పదవి అత్యంత కీలకమైంది. బిసిసిఐ అధ్యక్షుడి కంటే కార్యదర్శికే ఎక్కువ అధికారాలు ఉంటాయి. ఇప్పటి వరకు బిసిసిఐ కార్యదర్శిగా పదవి బాధ్యతలు నిర్వర్తించిన జైషా ఐసిసి చైర్మన్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే. ఇటీవలే జైషా ఐసిసి చైర్మన్ బాధ్యతలను చేపట్టారు. దీంతో బిసిసిఐ కార్యదర్శి పదవి ఖాళీ అయ్యింది.

ఈ నేపథ్యంలో జైషా వారసుడిగా ఎవరినీ ఎంపిక చేస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బిసిసిఐలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ పదవిపై చాలా మంది కన్నేశారు. ఢిల్లీ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ ఈ పదవి చేపడు తారని జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే ఈ కథనాలను రోహన్ జైట్లీ కొట్టిపారేశారు. ప్రస్తుతం కార్యదర్శి పదవి రేసులో గుజరాత్ క్రికెట్ సంఘం కార్యదర్శి అనిల్ పటేల్, బిసిసిఐ సంయుక్త కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా పేర్లు వినిపిస్తున్నాయి.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**